
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
మంగళవారం, 18 ఫిబ్రవరి 2025


కిలకిలలు.. కువకువలు









కనకగిరి రిజర్వు ఫారెస్ట్‌లో అరుదైన పక్షి జాతులు

- నేచర్‌వాక్‌లో గుర్తించిన నిపుణులు
- రాష్ట్రంలోనే తొలిసారిగా రికార్డయిన బ్లూ ఇయర్డ్ కింగ్ ఫిషర్
- ఆసియా, ఆఫ్రికా అడవుల్లో నివసించే షిక్రా పక్షి పులిగుండాలలో..

సత్తుపల్లి/పెనుబల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి అటవీ డివిజన్ పరిధిలోని తల్లాడ-కల్లూరు కనకగిరి రిజర్వు ఫారెస్ట్‌లో నిర్వహించిన నేచర్ వాక్‌లో అరుదైన పక్షిజాతులను నిపుణులు గుర్తించారు. 4 కిలోమీటర్ల అడవిని అన్వేషించిన సందర్భంలో 65 పక్షిజాతులు, 5 క్షీరద జాతులు, 5 చేప జాతులను కనుగొన్నట్టు ఖమ్మం డీఎఫ్‌వో సిద్ధార్థ్ విక్రం సింగ్ తెలిపారు. ఈ నేచర్ వాక్‌లో బ్లూ ఇయర్డ్ కింగ్ ఫిషర్ కనిపించగా ఈ పక్షి తెలంగాణలో మొట్టమొదటి సారిగా రికార్డు అయినట్టు తెలిపారు. బ్లాక్-వింగ్డ్ క్రైక్, రూఫస్ వడ్రంగి పిట్ట, వైట్-రంప్డ్ మునియా, బ్లూ-త్రోటెడ్ బ్లూ ఫ్లైక్యాచర్, బ్లాక్-రంప్డ్ షామాలు కనిపించినట్టు చెప్పారు. నేచర్ వాక్‌లో అత్యంత విలువైన సమాచారం కనకగిరి రిజర్వు ఫారెస్ట్‌లో లభించిందని తెలిపారు.

కాగా, కనకగిరి రిజర్వు ఫారెస్ట్ వైవిధ్యంగా ఉన్న పక్షులకు నిలయంగా మారిందని పర్యావరణ ప్రాముఖ్యత స్పష్టం చేస్తోంది. కనకగిరి పూర్వాపరాలను పుస్తక రూపంలో అటవీ శాఖ త్వరలోనే ఆవిష్కరించనుంది. నేచర్ వాక్‌లో ఎఫ్‌డీవో వాడపల్లి మంజుల, ఎఫ్ఆర్‌వో ఉమ, డీఆర్ఎస్‌లు సురేష్, రామ్‌సింగ్‌లు, పలు సంస్థలకు చెందిన ప్రదీప్‌ప్రాజ్, నవీన్‌బాలా, సుజీత్, హరికృష్ణ, రమేష్‌లతోపాటు పలువురు ప్రకృతి ఔత్సాహికులు పాల్గొన్నారు. కనకగిరి రిజర్వు ఫారెస్ట్‌ను సందర్శించి నిరంతరం అభివృద్ధి చేయనున్నట్టు సిద్ధార్థ్ విక్రం సింగ్ తెలిపారు.

పులిగుండాలలో...

పులిగుండాల అటవీ ప్రాంతం నుంచి భద్రాద్రి జిల్లా చంద్రుగొండ మండలం పళ్లెర్లబాయి గుట్ట వరకు ఉన్న అటవీ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు నేచర్ వాక్ సాగింది. ఆసియా, ఆఫ్రికా అడవుల్లో నివసించే షిక్రా పక్షి అనేక దీపాల్లో ఉండే మోనార్కిడే కుటుంబానికి చెందిన ప్యారడైజ్ ఫ్లై క్యాచర్ పక్షులు, ఈశాన్య భారతం, ఆగ్నేయాసియాలో నివసించే ప్లమ్-హెడెడ్ పారకీట్ అనే చిలుక పులిగుండాల అడవిలో సంచరిస్తుందని వన్యప్రాణి నిపుణులు రమేష్, ప్రదీప్, నవీన్ తెలిపారు. కార్యక్రమంలో సుజిత్, శ్రావణ్, హరికృష్ణ, పూజిత, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.


కనకగిరి రిజర్వు ఫారెస్ట్‌లో నిర్వహించిన నేచర్‌వాక్‌లో పాల్గొన్న సంస్థల ప్రతినిధులు, అటవీ శాఖ అధికారులు


కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర, ఎమ్మెల్సీ తాతా, కొండబాల

ఘనంగా కేసీఆర్ బర్త్‌డే

- మమత ఆస్పత్రిలో కేక్ కట్ చేసిన మాజీ మంత్రి అజయ్
- కాంగ్రెస్ పాలనలో ఒరిగింది శూన్యమని విమర్శ
- జిల్లా కార్యాలయంలో వేడుకల్లో పాల్గొన్న నేతలు

వివరాలు : 7లో

స్వీయ రక్షణ సగమే శిక్షణ



ఆడపిల్లల స్వీయరక్షణకు శిక్షణ ఇస్తూ వారికి భద్రతపై భరోసా కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం సర్కార్ పాఠశాలల్లో ప్రవేశపెట్టిన యుద్ధ విద్య నామమాత్రంగా కొనసాగుతోంది. విద్యార్థి దశ నుంచే బాలికలకు భరోసా కల్పించేందుకు పలు పాఠశాలల్లో కరాటే, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. అయితే జిల్లాలో కార్యక్రమం సగం పాఠశాలల్లోనే సరిగా సాగుతోందని, మిగిలిన పాఠశాలల్లో నామమాత్రంగానే శిక్షణ సాగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- పాఠశాలల్లో నామమాత్రంగా యుద్ధవిద్య
- భద్రతపై భరోసా కోల్పోతున్న బాలికలు
- 284 పాఠశాలలకు రూ.15వేల చొప్పున రూ.42.60 లక్షలు కేటాయింపు
- నిధుల దుర్వినియోగంపై పలు ఆరోపణలు
- కలెక్టర్ జోక్యం చేసుకున్నా.. మారని శిక్షణ తీరు
- పర్యవేక్షణ లోపమే కారణమని విమర్శలు



ఖమ్మం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థినులకు రక్షణ కల్పించాలని తలపెట్టిన యుద్ధవిద్య మిథ్యగా మారుతోంది. పాఠశాలల్లోని ఎనిమిది, తొమ్మిది, పది తరగతుల విద్యార్థినులకు మార్షల్‌ఆర్ట్స్‌లో శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను కొందరు శిక్షకులు బేఖాతరు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఏటా జిల్లాలోని కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి ఆయా పాఠశాలల్లో విద్యార్థినులకు ఈ శిక్షణ ఇస్తున్నారు. ఈ ఏడాది కూడా జిల్లాలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి విద్యార్థినులకు యుద్ధ విద్యలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. అందుకుగాను జిల్లాలో 284 పాఠశాలలను ఎంపిక చేయగా వాటిల్లో 26 పాఠశాలలు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో శిక్షణ నిర్వహణకు ఒక్కో పాఠశాలకు రూ.15వేల చొప్పున మొత్తం రూ.42.60లక్షలను కేటాయించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఒక్కో పాఠశాలలో మూడు నెలలపాటు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా.. చాలా పాఠశాలల్లో అది ఇంకా ప్రారంభం కాలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నామమాత్రంగానే నిర్వహణ

పాఠశాలల్లో కరాటే శిక్షణ నిమిత్తం కేటాయించిన నిధులతో గతంలో ఒక్కో శిక్షకుడు 20కి పైగా పాఠశాలలను కేటాయింపజేసుకుని అధికారులతో కలిసి అందినకాడికి దండుకునేవారు. అయితే ఈ ఏడాది కూడా అదేతంతు కొనసాగుతున్న తరుణంలో కొందరు ట్రైనర్లు జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయా పాఠశాలలకు తగ్గట్టుగా శిక్షకులను నియమించాలని, అందులో మహిళా శిక్షకులకు ప్రాధాన్యం ఇవ్వాలంటూ కలెక్టర్ ఆ బాధ్యతలను విద్యాశాఖతో పాటు, క్రీడాభివృద్ధి అధికారులకు అప్పగించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆదేశాలకు తగ్గట్టుగా దరఖాస్తులను స్వీకరించిన అధికారులు 284 పాఠశాలలకు సుమారు 80 మంది శిక్షకులను నియమించారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఒక్కో శిక్షకుడికి మూడు పాఠశాలల వరకు అప్పగించడంతో వారు వారానికి కేవలం మూడు గంటలు మాత్రమే శిక్షణ ఇస్తున్నారు. అదీ కూడా అరకొరగానే సాగుతోందన్న విమర్శలున్నాయి. ఇక మారుమూల ప్రాంతాల్లో ఉన్న పాఠశాలలను పట్టించుకునే పరిస్థితే లేదన్న వాదన వినిపిస్తోంది.

పర్యవేక్షణ లోపమే కారణం

పర్యవేక్షణలోపం కారణంగానే కరాటే శిక్షణ సరిగ్గా సాగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పదులకొద్దీ పాఠశాలల్లో నామమాత్రంగా శిక్షణ ఇవ్వడంపై విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లనే పాఠశాల అధికారులు ఆడింది ఆటగా సాగుతోందన్న విమర్శలు ఉన్నాయి. కొంతమంది ప్రధానోపాధ్యాయులకైతే అసలు శిక్షణ ఎన్నిరోజులివ్వాలి, ఎంత సమయం కేటాయించాలనే అంశాలు కూడా తెలియక పోవడం గమనార్హం.. కొందరు శిక్షకులు తమకు ఇష్టం వచ్చిన సమయాల్లో వెళ్లి కాలక్షేపం చేసి తిరిగి వస్తున్నారు. మరికొన్ని చోట్ల ప్రధానోపాధ్యాయులు, శిక్షకులు కలిసి శిక్షణ ఇవ్వకుండానే నిధులు వినియోగించినట్టు దొంగ లెక్కలు చూపించేందుకు సిద్ధమవుతున్నారన్న ఆరోపణలున్నాయి. అంతేకాకుండా ప్రస్తుతం శిక్షకులకు కేటాయించిన పాఠశాలలు చాలా దూరప్రాంతంలో ఉండడంతో వారు అక్కడికి వెళ్లేందుకు విముఖంగా ఉంటున్నట్టు తెలుస్తోంది. దాంతో సగం పాఠశాలల్లోనే యుద్ధ విద్య అమలవుతున్నట్టు తెలుస్తోంది.


జాతరలో భక్తుల సందడి

వైభవంగా లింగమంతుని జాతర

- రేగులగండి అడవిలో పోటెత్తిన భక్తజనం
- ఇలవేల్పులను కొలిచిన యాదవులు
- హాజరైన ఎమ్మెల్యే పాయం, సీపీఐ రాష్ట్ర నేత అయోధ్య

వివరాలు : 6లో


వేమన శతక పద్యాలను పఠిస్తున్న విద్యార్థులు

విశ్వదాభిరామా.. విన్నాము వేమ!

- వేమన శతక పద్యాల సామూహిక ఆలాపన
- ఒకేసారి 200 మంది విద్యార్థుల గళార్చన
- జేవీఆర్ కళాశాలలో వీనులవిందు చేసిన కార్యక్రమం

వివరాలు : 6లో

ప్రాణం తీసిన వాట్సాప్ చాటింగ్

- తన క్లాస్‌మేట్‌కు బాలుడి మెస్సేజ్‌లు
- గమనించి బెదిరించిన బాలిక కుటుంబసభ్యులు
- మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య

చుంచుపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదో తరగతి చదువుతున్న బాలుడు..తన క్లాస్‌మేట్ అయిన బాలికతో వాట్సాప్‌లో చాటింగ్ చేశాడు. ఇది గమనించిన ఆమె కుటుంబసభ్యులు... బాలుడికి ఫోన్ చేసి బెదిరించారు. దీంతో భయపడిన సదరు బాలుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన భద్రాద్రి జిల్లా చుంచుపల్లి మండలంలోని చుంచుపల్లి తండాలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చుంచుపల్లితండా ప్రాంతానికి చెందిన బాదావత్ రమేష్ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. అతడి కుమారుడు మనోజ్(15) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మనోజ్‌కు తన క్లాస్‌మేట్ అయిన బాలికతో స్నేహం ఉండటంతో తరుచూ ఫోన్‌లో వాట్సాప్ చాటింగ్ చేసేవాడు. ఈ క్రమం లో గత శనివారం చాటింగ్ చేయగా, గమనించిన ఆమె కుటుంబసభ్యులు వెంటనే మనోజ్‌కు ఫోన్‌చేసి బెదిరించారు. తమ అమ్మాయితో ఎందుకు చాటింగ్ చేస్తున్నావని ప్రశ్నించారు. దీంతో మనస్తాపం చెందిన మనోజ్ ఇంట్లోవున్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కొత్తగూడెం సర్వజన ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.బాలుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఇసుకాసురులపై ఉక్కుపాదం

- అక్రమ రవాణాపై పటిష్ఠ నిఘా
- ఆదేశాలు జారీచేసిన ఉన్నతాధికారులు
- ర్యాంపుల్లో సాగుతున్న తనిఖీలు

7

నూరుశాతం ఫలితాలే లక్ష్యంగా...

- పదో తరగతి విద్యార్థులను సిద్ధం చేస్తున్న ఐటీడీఏ
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- మార్చి 6 నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు



భద్రాచలం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో ఈసారి జరిగే పదో తరగతి వార్షిక పరీక్షల్లో నూరు శాతం ఫలితాలే లక్ష్యంగా అధికారులు విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే రాబోయే రోజుల్లో పది విద్యార్థులకు వారి దినచర్య ఏ విధంగా ఉండాలనే దానిపై అధికారులకు ఐటీడీఏ పీవో బి.రాహుల్ దిశానిర్దేశం చేయడంతో అందుకు అనుగుణంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చదివిస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరంలో 55 ఆశ్రమ పాఠశాలలు, 20వసతి గృహాల నుంచి 2,600మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరవుతున్నట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. వంద రోజుల ప్రణాళిక ఇప్పటికే అమలవుతున్న క్రమంలో మార్చి ఆరు నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. ఇదిలా ఉండగా పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు జీపీఏ ఆధారంగా పరీక్షలు నిర్వహించడం ఇదే చివరిసారి కావడంతో అత్యధిక శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.

గత విద్యా సంవత్సరంలో...

2023-24 విద్యా సంవత్సరంలో ఆశ్రమ పాఠశాలల్లో 91.16 శాతం ఉత్తీర్ణత రాగా.. ఐటీడీఏ చరిత్రలోనే ఇది అత్యధికం. అలాగే వసతి గృహాల్లో 84.34 శాతం ఫలితాలు వచ్చాయి. ఈ క్రమంలో 2024-25 విద్యా సంవత్సరంలో నిర్వహించే పదో తరగతి వార్షిక పరీక్షల్లో పది ఫలితాలు నూరు శాతం ఉండాలనే దిశగా ఐటీడీఏ విద్యాశాఖ అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు, ఐటీడీఏ యూనిట్ అధికారులు, ఏటీడీవోలు, ఎంపీడీవో,

ఆదర్శనీయుడు సేవాలాల్

- బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చిన ఘనత ఇందిరమ్మదే
- ఆదివాసీ గౌరవాన్ని పెంచేలా ప్రభుత్వ కార్యక్రమాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బంజారాలను ఎస్టీ జాబితాలో చేర్చిన ఘనత ఇందిరమ్మదేనని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బంజారాల గౌరవాన్ని పెంచేలా రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. సోమవారం కూసుమంచిలో గిరిజన ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే గిరిజన జీవితాల్లో వెలుగులు నిండాయని పేర్కొన్నారు. గిరిజనులకు విద్య, వైద్యం, ఉపాధి రంగాలను దగ్గరకు చేర్చిందన్నారు. తండాల్లో మౌలిక సదుపాయాలకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో గిరిజనులు కాంగ్రెస్ పక్షాన నిలబడి ఇందిరమ్మ రాజ్యం తెచ్చుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి, గిరిజనులకు మధ్య ఫెవికాల్ బంధం ఉందని ఇది ఎవరో విడగొడితే విడిపోయేది కాదన్నారు. బంజారాల మీద ఉన్న ప్రేమ, అభిమానం, ఆత్మీయతతోనే ఆనాడు ఇందిరమ్మ ఎస్టీ సామాజిక వర్గంలో చేర్పించిందన్నారు. సామాన్యుడిగా పుట్టి అసామాన్యుడిగా ఎలా ఎదగాలో ఆచరించి చూపిన మహానుభావుడు సేవాలాల్ అనే కొనియాడారు.సేవాలాల్ జయంతిని ప్రభుత్వం ఫిబ్రవరి 15సెలవుదినంగా ప్రకటించి అధికారికంగా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. బంజారాల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు, గిరిజన నాయకులు పాల్గొన్నారు.


కూసుమంచిలో పూజలు చేస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఆయిల్‌పామ్‌కు ప్రోత్సాహకమేది?

- రూ.4200ల కోసం రైతుల ఎదురుచూపులు
- డ్రిప్ ఏర్పాటుకు తాత్సారం



చినబండిరేవులో ఆయిల్‌పామ్ తోట

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): దేశంలో ఆయిల్‌పామ్ సాగుచేసే రాష్ట్రాల్లో తెలంగాణా రెండో స్థానంలో ఉండగా, ఏపీ ముందుంది. ఆయిల్‌పాం సాగుకు ప్రోత్సాహకంగా కేంద్రం అరవైశాతం, రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులను కేటాయిస్తోంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు బిందు సేద్యం పరికరాలను వంద శాతం సబ్సిడీపై, వెనుకబడిన తరగతులకు 90 శాతం, ఇతరులకు 80శాతం సబ్సిడీపై ఇస్తున్నారు. కాగా మండలంలో ఆయిల్‌పాం సాగుచేసే రైతులకు ప్రోత్సాహం కరువైంది. మొదటి నాలుగేళ్ల పాటు అందజేసే రూ4200 నగదు ప్రోత్సాహకంతోపాటు, సబ్సిడీపై డ్రిప్ పరికరాలు మండల రైతులకు సకాలంలో అందడం లేదనే ఆరోపణలున్నాయి.

అందని నగదు ప్రోత్సాహకం

మండలంలో సుమారు 70 ఎకరాల ఆయిల్ పాం పంట సాగవుతోండగా, మరో 30ఎకరాల్లో సాగుకు అనుమతి లభించింది. మొక్కలు నాటిన తర్వాత మొదటి నాలుగేళ్ల పాటు ఎకరాకు రూ.4200ల నగదు ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం నుంచి రైతులకుఅందజేస్తారు. అంతర పంటల సాగుకు రూ.2100లు, ఆయిల్‌పాం తోట యాజమాన్యం కోసం రూ.2100లుగా నిర్ణయించారు. కొందరు రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రోత్సాహక నగదు రూ.4200లు జమవగా, కొందరికి రాలేదు. ఏటా మార్చిలోగా రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రోత్సాహక నగదు జమ కావాల్సి ఉండగా, 2024 సంవత్సరంలో పడలేదు. 2025 మార్చి నెలకు రెండో కిస్తీ అందాల్సి ఉండగా, గతేడాదికు సంబంధించిన ప్రోత్సాహక నగదు నేటికీ అందలేదని రైతులు అంటున్నారు. మొక్కలు నాటి ఆరు నెలలు దాటినా డ్రిప్ పరికరాల ఏర్పాటుకు అవసరమైన చర్యలను సంబందిత అధికారులు చేపట్టలేదు.

అందని ప్రోత్సాహక నగదు

మొదటి ఏడాది ప్రోత్సాహక నగదు రూ.4200లు అందాయి. 2024 మార్చిలోగా రావాల్సిన నగదు నేటికీ జమ కాలేదు. మూడో దఫా ప్రోత్సాహక నగదు ఇవ్వాల్సిన సమయం కూడా వచ్చింది. ఆరు నెలల క్రితం రెండెకరాల ఆయిల్‌పామ్ మొక్కలు వేశాను. నేటికి డ్రిప్ పరికరాల ఏర్పాటుకు సంబందించి అధికారులు కొలతలు తీసుకోలేదని సీతారాంపురానికి చెందిన ఆయిల్‌పామ్ రైతు చదలవాడ చంద్రశేఖర్‌రావు తెలిపారు.

వివరాలన్నీ సక్రమంగా ఉంటేనే...

సాయికృష్ణ, ఉద్యాన అధికారి

రైతులకు ప్రోత్సాహక నగదు పెండింగులో ఉన్న మాట వాస్తవమే. జిల్లా వ్యాప్తంగా ఆయిల్‌పాం రైతుల డాక్యుమెంట్ల పరిశీలన పూర్తికాలేదు. ఈ దఫా ట్రెజరీ నుంచి నేరుగా రైతుల ఖాతాల్లో నగదు జమవుతుంది. వివరాలన్నీ సక్రమంగా ఉన్న రైతులందరికీ ప్రస్తుత మార్చిలోగా ప్రోత్సాహక నగదు ఖాతాలలో జమ అవుతుంది.

నూరుశాతం ఫలితాలే లక్ష్యంగా...

(5వ పేజీ తరువాయి)

ఎంఈవోలు మొత్తం 30 మంది అధికారులు ఆశ్రమాలు, వసతి గృహాల దత్తత కార్యక్రమాన్ని చేపట్టారు.

మార్చి 6 నుంచి ప్రీ ఫైనల్

వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను అధికారులు ఇప్పటికే రూపొందించి అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా నెలవారీ స్లిప్ టెస్టులు, మూడు గ్రాండ్ టెస్టులు, ఎస్ఏ-1 పరీక్షలు పూర్తి చేశారు. విద్యార్థులను గ్రేడ్‌ల వారీగా విభజించి వెనుకబడిన విద్యార్థులను ముందుకు తీసుకెళ్లేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. రాత్రి సమయంలో స్టడీ అవర్స్ సైతం నిర్వహిస్తుండటంతో సంబంధిత ఉపాధ్యాయులు పాఠశాలలోనే బస చేయాలని పీవో రాహుల్ ఆదేశించారు. కొంతమంది రాత్రి పాఠశాలలో బస చేయకుండా ఉదయం వస్తున్నారని పీవో ఇటీవల సైతం ప్రస్తావించడం గమనించదగ్గ విషయం. దీంతో దత్తత అధికారులు ప్రధానోపాధ్యాయలు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి నిలిపి సబ్జెక్టు టీచర్లు స్థానికంగా బస చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం పిదప సింగరేణి కాలరీస్ సంస్థ ప్రభుత్వాలకు, అధికార పార్టీ నాయకులకు కాసులు కురిపించే కామధేనువుగా మారింది. అధికారంలో ఉన్న పార్టీల ప్రజా ప్రతినిధుల జోక్యం మితి మీరడం కార్మికులు రేయింబవళ్లు చెమటోడ్చి పోగేస్తున్న లాభాలు ప్రభుత్వ పథకాలకు మళ్లిస్తున్న తీరు. కార్మికుల కష్టార్జితం సింగరేణి పురోభివృద్ధికి నూతన గనుల ఏర్పాటుకు కార్మికుల కటుంబాల సంక్షేమానికి వినియోగించకుండా.. ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా నిధులు మరలిస్తున్న పరిణామాలపై కార్మిక సంఘాలు మండి పడుతున్నాయి. తుదకు సింగరేణిలో కార్మిక సంఘాల ఎన్నికల్లో గుర్తింపు సంఘంగా ఎన్నికైన యూనియన్ ప్రాతినిధ్యాలను సైతం నిర్లక్ష్యం చేస్తుండటంతో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆందోళనలకు సమాయత్తమవుతోంది.

శ్రుతి తప్పిన సిరుల వీణ

- సింగరేణిలో పెచ్చుమీరిన రాజకీయ జోక్యం
- తెలంగాణ ఆవిర్భావం పిదప యథేచ్ఛగా నిధుల పక్కదారి
- గుర్రుమంటున్న కార్మిక సంఘాలు
- ఆగ్రహిస్తున్న గుర్తింపు సంఘం

ఇల్లెందు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భవించాక దశాబ్ద కాలం బీఆర్‌ఎస్ పాలన సాగడం గత 14 నెలలుగా కాంగ్రెస్ పాలన సాగుతున్న విషయం తెలిసిందే. బీఆర్‌ఎస్ అధికారంలో ఉండగా కోల్‌బెల్ట్ వ్యాప్తంగా సింగరేణిలో అధికార పార్టీ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపిలు, ఎమ్మెల్సీల పెత్తనం ఇష్టారాజ్యంగా సాగింది. ప్రభుత్వం అమలు చేయాల్సిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు సింగరేణి నిధులు వినియోగించుకున్నారనడం అతిశయోక్తి కాదు. సింగరేణి సంస్థ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ పథకాలకు కేటాయించిన వేల కోట్ల నిధులు గత ప్రభుత్వం యథేచ్ఛగా తమ పార్టీ ప్రజా ప్రతినిధుల అదుపాజ్ఞల్లో కనుసన్నల్లో ఖర్చు చేసింది. సింగరేణి ప్రభావిత ప్రాంతాల ప్రజలకు మౌళికవ సతులు వారి సంక్షేమానికి ఖర్చు చేయాల్సిన నిధులను సింగరేణికి సంబంధం లేని ప్రాంతాలకు నియోజకవర్గాలకు కేటాయించింది. తుదకు హైద్రాబాద్ లో సీసీ కేమెరాల ఏర్పాటుకు, సూర్యపేటలో కబడ్డీ పోటీలకు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో అప్పటి కీలక నేతల ఆదేశాలతో సింగరేణి సొమ్మును వినియోగించుకున్నారు. సింగరేణిలో ఉన్నత స్థాయి డైరెక్టర్లు మొదలుకొని ఏరియా స్థాయిల్లో అధికారులంతా అధికార పార్టీ మంత్రులు ఎమ్మెల్యేల కనుసన్నల్లో పనిచేయవలసిన పరిస్థితుల్లోకి సింగరేణి కూరుకుపోయింది.

తగ్గని రాజకీయ జోక్యం

తుదకు సింగరేణిలో బదిలీలు, సర్వీస్ విధులు కాంట్రాక్టు పనుల కేటాయింపులు కోల్ ట్రాన్స్‌పోర్టు దందాలు, అధికార పార్టీ నేతల అదుపాజ్ఞల్లోనే సాగడంతో ఆగ్రహించిన కార్మిక వర్గం కోల్‌బెల్ట్ వ్యాప్తంగా మొత్తం అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్‌ను మూకుమ్మడిగా ఓడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కూడా సింగరేణి వ్యవహారాల్లో రాజకీయ జోక్యం నిలిచిపోలేదన్న విమర్శలు వస్తున్నాయి. గడిచిన 14 నెలల కాలంలో సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో అధికార పార్టీ కనుసన్నల్లోనే సింగరేణి ఉన్నత స్థాయి నుంచి మైన్స్ స్థాయి అధికారుల వరకు పనిచేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

తీవ్ర అసంతృప్తి...

ప్రభుత్వ సంస్థలు బకాయి పడిన రూ.33 వేల కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం పూనుకోవడం లేదని విమర్శిస్తున్నాయి. 2023-24 సంవత్సర పీఆర్‌పీని పి సైతం చెల్లించపోవడంతో సింగరేణి అధికారుల్లో సైతం అసంతృప్తి గూడు కట్టుకుంది. సింగరేణిలో గతంలో ఎప్పుడు జరగని రీతిలో గత 11 ఏళ్లగా రాజకీయ జోక్యం పెచ్చుమీరడం అధికార పార్టీల కనుసన్నల్లో కార్యకలాపాలు సాగుతున్న తీరు కార్మిక వర్గంలో తీవ్ర అసంతృప్తికి కారణం అవుతోంది.

గుర్తింపు సంఘం గుస్సా

కాంగ్రెస్‌కు సీపీఐ, మిత్ర పక్షంగా అసెంబ్లీ ఎన్నికల్లో వ్యవహరించినప్పటికీ సింగరేణి ఎన్నికల్లో పరస్పరం పోటీ పడటం తో సీపీఐ అనుబంధ ఏఐటియూసీకి ఘన విజయం చేకూరింది. గతంలో సింగరేణిలో విధాన నిర్ణయాలు గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలతో సింగరేణి యాజమాన్యం చర్చించి విధాన నిర్ణయాలు తీసుకునే సంప్రదాయం ఉండేది. కానీ ఏఐటియూసీ సింగరేణిలో గెలుపొందినప్పటికీ ప్రాధాన్యం లభించడం లేదన్న ఆవేదన గుర్తింపు సంఘం నాయకులు వ్యక్తం చేస్తున్నారు. రెండు మూడు నెలలకు ఓ సారి స్ట్రక్చరల్ సమావేశాలు జరపడం లేదని గతంలో గుర్తింపు కార్మిక సంఘం కాలపరిమితి నాలుగేళ్లు కొనసాగితే ఏఐటియూసీ కేవలం రెండు సంవత్సరాల కాలపరిమితి విధిస్తూ ఉత్తర్వులు జారీ కావడం రెండు పేర్ల మార్పిడి జరగక పోవడం కారుణ్య నియామకాల్లో అడ్డంకిగా మారడం గుర్తింపు సంఘం ఆగ్రహానికి కారణమైనట్లు సమాచారం. కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు చేయాలని మైనింగ్ ఆపరేషన్లు జరగని ఏరియాల్లో క్వార్టర్లను రిటైర్డు కార్మికులకు కేటాయించాలన్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్న ఆగ్రహాన్ని గుర్తింపు సంఘం వ్యక్తం చేస్తోంది.

యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఉన్న కూనంనేని సాంబశివరావు సింగరేణిలో జరుగుతున్న పరిణామాల పట్ల ఇటీవలనే రాజకీయ జోక్యం పెచ్చుమీరిందంటూ ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం.

వాటి మాటే శాసనం

సింగరేణి ఏరియాలో అభివృద్ధి పనులు కాంట్రాక్టులు బొగ్గు రవాణా, బదిలీలు, అవుట్ సోర్సింగ్ పనులు, కార్మికుల నియామకాలను సైతం అధికార పార్టీ నాయకులే శాసిస్తున్నారన్న విమర్శలు పెల్లుబుకుతున్నాయి. తుదకు డిప్యూటేషన్లు, సర్వీస్ విధులు, క్వార్టర్ల కేటాయింపుల విషయం మొదలు మెడికల్ అన్‌ఫిట్ కారుణ్య నియామకాల వరకు అధికార నేతల కనుసన్నల్లో జరుగుతున్నాయని పలు కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. అధికార నేతల ఆమోదం లేకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేక పోతున్నామని కొందరు సింగరేణి అధికారులు సైతం వాపోయారు. ఓపెన్ కాస్టు గనులు కాసులు కురిపించే కల్పతరువుగా అధికారనేతలకు మారాయన్న విమర్శలు పెల్లుబుకుతున్నాయి.

రాజకీయ జోక్యం గతం కంటే పెరిగింది

వాసిరెడ్డి సీతారామయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు



సింగరేణిలో గత బీఆర్ఎస్ విచ్చలవిడి తనం, నిధుల మళ్లింపు మితిమీరిన జోక్యంతో కార్మికుల ఆగ్రహానికి గురైంది. కానీ నేడు అంతకంటే ఎక్కువ రాజకీయ జోక్యం పెరిగింది. సింగరేణి పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడినట్లైంది.

సింగరేణి రక్షణకు ఉద్యమం

మందా నర్సింహారావు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



కంపెనీభవిష్యత్తు ప్రమాదకరంగా ఉంది. బొగ్గు గనుల వేలంతో కేంద్రం బొగ్గు పరిశ్రమకు హాని కలిగిస్తుంటే సింగరేణిలో మితిమీరిన రాజకీయ జోక్యం ముప్పుగా మారింది. ఈ పరిణామాలను ప్రతిఘటించకపోతే సింగరేణికి ముప్పుకలుగుతుంది.

బీఆర్ఎస్ తరహాలోనే కాంగ్రెస్ జోక్యం

యాదగిరి సత్తయ్య , బీఎంఎస్ రాష రాష అధ్యక్షుడు



బీఆర్ఎస్ తరహాలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సింగరేణిలో మితిమీరిన జోక్యం చేసుకుంటుంది. విధాన నిర్ణయాల్లో కార్మిక సంఘాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవడం లేదు. ఎమ్మెల్యేలు, ఎంపీ ఎమ్మెల్సీల జోక్యంతో విపరీతంగా ఉంది.

సింగరేణి భవితకు పెను ముప్పు

రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు



చంద్రబాబు పాలన వరకు సింగరేణిలో రాజకీయ జోక్యం ఉండేది కాదు. కానీ నేడు కొందరు అధికారులే రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ స్వార్థం కోసం ప్రదక్షిణలు చేస్తూ సింగరేణి భవిష్యత్ ను దెబ్బ తీస్తున్న దుస్థితి నెలకొంది.

వైభవంగా లింగమంతుని జాతర

- రేగులగండి అడవంతా జనమే
- ఇలవేల్పులను కొలిచిన యాదవులు
- హాజరైన ఎమ్మెల్యే పాయం, సీపీఐ రాష్ట్ర నేత అయోధ్య



జాతరకు హాజరైన జనం, ఏర్పాటు చేసిన స్టాల్స్

మణుగూరు/అశ్వాపురం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మణుగూరు మండలంలోని రేగులగండి అడవిలో లింగమంతుని జాతర వైభవంగా ప్రారంభమైంది. యాదవుల ఇల వేల్పుగా భావించే లింగమంతుడిని యాదవులు వేలాదిగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ వేడుకలకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సీపీఐ నేత అయోధ్య మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డిలు హాజరయ్యారు. ఎమ్మెల్యేకు యాదవ కులపెద్దలు గౌరవ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ఎమ్మెల్యే పాయం, అయోధ్య పాల్గొన్నారు. మణుగూరు డీఎస్పీ రవీంద్రరెడ్డి శాంతి భద్రతల ఏర్పాట్లను పర్యవేక్షించారు. రేగులగండి అటవీ ప్రాంతం అంతా జనంతో నిండిపోయింది. ఎక్కడ చూసినా వాహనాలు, ప్రజలే కనిపించారు. ఈ ప్రాంతానికి వచ్చేందుకు రోడ్డు సదుపాయాన్ని కల్పించారు. మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎంపీవో వెంకటేశ్వర్లు, అశ్వాపురం సీఐ జీ.అశోక్‌రెడ్డి, ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జాతీయ నాయకుడు చందా లింగయ్య, రాష్ట్ర నాయకులు వట్టం నారాయణ దొర, జిల్లా నేత ఆలెంకోటి, తదితరులు సోమవారం రాత్రి లింగమంతున్ని దర్శించుకున్నారు.



లింగమంతున్ని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పాయం, అయోధ్య

పోటెత్తిన భక్తులు

మణుగూరు-అశ్వాపురం మండలాల సరిహద్దులోని రేగులగండి గుట్టపై యాదవులు ఆరాధ్య దైవంగా భావించే భవానీ లింగమంతుని జాతర సోమవారం వైభవంగా ప్రారంభమైంది. భవానీ లింగమంతులకు మహిళలు బోనాలు సమర్పించటంతో ఉత్సవం ప్రారంభం కాగా తెల్లవారు జామున ఆలయకమిటీ ఆధ్వర్యంలో శ్రీభవాని, లింగమంతుల స్వామికి వేదపండితుల అష్టోచ్చారణల మధ్య, మంగళవాయిద్యాల నడుమ, భక్తుల జయధ్వానాలతో కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. కాగా కల్యాణానికి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై లింగమంతుల స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రెండేళ్లకోసారి నిర్వహించే జాతరలో భవానిలింగమంతుల కల్యాణం తిలకించేందుకు అశ్వాపురం, మణుగూరు, పినపాక మండలాల నుంచి భక్తులు తరలివచ్చారు. సింగరేణి జీఎం రామచందర్ పాల్గొని భవానీ లింగమంతులకు ప్రత్యేకపూజలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయకమిటీ, సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. మంగళవారం వరదపాశంతో జాతర ముగియనుంది.

భాష, సంస్కృతిని వారసత్వంగా అందిద్దాం

- జేవీఆర్‌లో వేమన శతక పద్య గళార్చన
- పద్యాలతో వేమన, సీపీ బ్రౌన్‌లకు విద్యార్థుల నివాళి
- అభినందించిన సత్తుపల్లి ఎంఈవో రాజేశ్వరరావు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అతిథులు

సత్తుపల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను ఒక తరం నుంచి మరో తరానికి వారసత్వ సంపదగా అందించాలని సత్తుపల్లి ఎంఈవో నక్కా రాజేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా తెలుగుదనం ఉట్టిపడేలా సత్తుపల్లికి చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 200మంది ఏకగళంతో చూడకుండా వంద వేమన పద్యాల పఠనం ఆకట్టుకుంది. సోమవారం స్థానిక జేవీఆర్ ప్రభుత్వ (అటానమస్) కళాశాలలో గార్లపాటి, బొల్లేపల్లి స్మారక ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు శాఖ, ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ, లైవ్, సృజన, మండల విద్యాశాఖల సహకారంతో వేమన శతక పద్య గళార్చన జరిగింది. అరగంట సేపు విద్యార్థులు వేమన శతక పద్యాలను చూడకుండా తమ ప్రతిభను ప్రదర్శించి ప్రశంసలు పొందారు. విద్యార్థుల్లో తెలుగు భాషపట్ల ఆసక్తిని పెంపొందించే దిశగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులను ప్రోత్సహిస్తున్న నిర్వాహకులను, సహకరిస్తున్న సంస్థలను ఎంఈవో అభినందించారు. వేమన స్పృశించని అంశం లేదని, ఆయన పద్యాలలో లోక నీతులు ఉంటాయని, సామాజిక చైతన్యం ఆ పద్యాల లక్షణమని, సమాజంలోని అన్ని సమస్యలు భిన్న కోణాల్లోంచి దర్శించి ఆ దర్శన వైశిష్ట్యాన్ని వేమన తన పద్యాలలో ప్రదర్శించారన్నారు. సామాజిక స్పృహను, నైతిక విలువలను, జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవడానికి వేమన శతకం ఉపకరిస్తుందన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పాఠశాలలకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నంద్రు గోపీ, నిర్వాహకులు రామకృష్ణ, మధుసూదన రాజు, కిషోర్‌రెడ్డి, గట్టి వాసు, నాగేశ్వరరావు, ప్రొఫెసర్ డాక్టర్ పూర్ణచంద్ర రావు, దొడ్డా కృష్ణయ్య, పల్లం పిచ్చయ్య, ఖాసీం, ప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయులు కల్యాణశర్మ, అయ్యదేవర శేషగిరిరావు, మాలతి, మల్లిఖార్జున రావు, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో నక్కా రాజేశ్వరరావు

మూడు నెలల్లో నేర్చుకున్నా..

లాస్య, 7వ తరగతి, జెడ్పీఎస్ఎస్, కాకరవాయి, తిరుమలాయపాలెం మండలం



వేమన పద్యాలు చదవడం, రాయడం మూడు నెలల్లో నేర్చుకున్నా. ఇప్పుడు నాకు తెలుగు భాష పట్ల ఇష్టం పెరిగింది. రాహుల్ సారు ఓపికగా నాకు పద్యాలు నేర్పారు. చదవడం, రాయడం నాకు సులభమైంది.

వేమన జయంతిని ప్రభుత్వం నిర్వహించాలి...

దుర్గా చరణ్, 9వ తరగతి, జెడ్పీఎస్ఎస్, ఎన్టీఆర్ నగర్, సత్తుపల్లి



వేమన జయంతిని ప్రభుత్వం నిర్వహించాలి. అన్ని పాఠశాలల్లో వేమన పద్యాలు నేర్పాలి. పద్మజ మేడమ్ పద్యాలతో పాటు వాటి భావం కూడా చెప్పారు. చదవడం, రాయడంతో పాటు ఈ పద్యాలలోని నీతి తెలుసుకున్నా..

కోలిండియా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను పకడ్బందీగా నిర్వహించాలి

జీఎం కవితానాయుడు

రుద్రంపూర్, (సింగరేణి) ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కోలిండియా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సింగరేణి జనరల్ మేనేజరు పర్సనల్ కవితానాయుడు కోరారు. దేశవ్యాప్తంగా పది కోల్ కంపెనీలకు చెందిన క్రీడాకారులకు పోటీలు నిర్వహించ నున్నట్టు తెలిపారు. సోమవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 22, 23 తేదీల్లో కొత్తగూడెం ప్రకాశంస్టేడియంలో క్రీడాపోటీలను నిర్వహిస్తున్నామని దూర ప్రాం తాల నుంచి వచ్చే క్రీడాకారులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అధికారులు రాజీవ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, అజయ్‌కుమార్, వర ప్రసా ద్, శివకేశవరావు, నారాయణరావు, నాగరాజు, రామశేషయ్య, డేవిడ్, జాకీర్ హుస్సేన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను పరిష్కరించండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి జనం తరలివచ్చి తమ సమస్యలను ఏకరువుపెట్టారు. తమ భూమి రికార్డులకు ఎక్కలేదని, పాస్ పుస్తకాలు రాలేదంటూ, ఇందిరమ్మ ఇల్లును కేటాయించాలంటూ ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు విన్నవించారు. సోమవారం ప్రజావాణిలో దాదాపు 89 దరఖాస్తులు అందినట్టు సమాచారం. వీటిలో 20 వరకు ధరణికి సంబంధించిన భూ సమస్యలు ఉన్నాయి. మిగిలినవి వివిధ రకాల సమస్యలను అధికారులకు దరఖాస్తుల ద్వారా విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులతో మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణికి సంబంధించి వచ్చిన అర్జీలను పరిశీలన చేసి పెండింగ్ లో లేకుండా తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీఆర్వో ఏ.పద్మశ్రీ, డీఆర్డీవో సన్యాసయ్య కలెక్టరేట్ పరిపాలన అధికారి ఎస్.అరుణ, తదితరులు పాల్గొన్నారు.

అందిన ఫిర్యాదుల్లో కొన్ని...

ఖమ్మంలోని గ్లోరీ జీసస్ సోషల్ సర్వీస్ సొసైటీ వర్క్ అసోసియేషన్ డైరెక్టర్ డి.గంగయ్య తమ స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రభుత్వ ఆధీనంలో నిరుపయోగంగా ఉన్న భవనాన్ని కేటాయించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నాడు.

బోనకల్ మండలం రావినూతల గ్రామానికి చెందిన ఎం.సీత పేదరికంలో ఉన్న తనను ఖమ్మం దగ్గరలో ఉన్న బీసీ గురుకులంలో స్వీపర్ పోస్ట్ ఇప్పించాలని కోరుతూ వేడుకుంది.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

తిరుమలాయపాలెం మండలం బచ్చోడు గ్రామంలోని బి.విజయ, బచ్చోడు గ్రామ ప్రాథమిక పాఠశాలలో 7.5 లక్షలు ఖర్చుచేసి టాయిలెట్ల రిపేర్లు, కరెంట్ నీటి వసతి కోసం పనులు చేశామని, తమకు అడ్వాన్స్ 25 వేలు మినహా ఏ బిల్లు రాలేదని, బిల్లులు చెల్లించాలని కలెక్టర్‌ను కోరారు.

భారజల ప్రతిష్టను మరింత ఇనుమడింప జేయాలి

మాజీ జీఎం ఉపాధ్యాయ

అశ్వాపురం ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మణుగూరు భారజల కర్మాగార ప్రతిష్టను మరింత ఇనుమడింపజేసే విధంగా యాజమాన్యం, ఉద్యోగులు కృషిచేయాలని భారజల బోర్డు మాజీ జీఎం(ఆపరేషన్స్)వీవీ ఉపాధ్యాయ అన్నారు. భారజల దినోత్సవం సందర్భంగా సోమవారం మణుగూరు హెవీవాటర్ ప్లాంట్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. 30ఏళ్లుగా మణుగూరు భారజల కర్మాగారం అణుశక్తి విభాగంలో దేశానికి అందిస్తున్న సేవలు చిరస్మరణీయమన్నారు. దేశంలోనే ప్రథమంగా ఆక్సిజన్-18 ప్లాంట్‌ను ప్రారంభించుకోవటం గర్వకారణమన్నారు. ప్లాంట్ జీఎం హెచ్‌కె. శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్ర మంలో డీజీఎంలు శర్మ, సీఏవో వేణు, ఐఆర్‌వో లత ప్లాంట్ ఉన్నతాధికారులు, ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో పంట రుణాలను ఇవ్వాలి

డీసీసీబీ చైర్మన్ దొండపాటి

దమ్మపేట, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు పంట రుణాలను సకాలంలో అందించాలని డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు సూచించారు. సోమవారం దమ్మపేట డీసీసీబీ బ్రాంచిని సందర్శించి మేనేజర్ నాగభూషణంతో రుణాలు, చెల్లింపులు, వసూళ్లగురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డీసీసీబీ ద్వారా రైతులకు మరిన్ని మెరుగైన సేవలను అందించేలా కృషి చేయాలని, పామాయిల్ రైతులకు సకాలంలో రుణాలను అందించాలన్నారు. సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు సొసైటీ కార్యాలయం వద్ద షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలని చైర్మన్‌ను కోరారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రాఘవరావు, కట్టం ఎర్రప్ప, ఎర్రగొర్ల రాధాకృష్ణ, దారా యుగంధర్ పాల్గొన్నారు.

క్రైం సమాచారం

పాఠశాలలో క్షుద్ర పూజల కలకలం

చండ్రుగొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): చండ్రుగొండ మండలం బాలికుంట గ్రామలోని ఐటీడీఏ పాఠశాలలో క్షుద్ర పూజలు నిర్వహించిన ఆనవాళ్లు వెలుగు చూడటంతో గ్రామంలో కలకలం చోటు చేసుకుంది. పాఠశాల ఉపాధ్యాయుడు రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం పాఠశాల ముగిసిన అనంతం తరగతి గదులకు తాళాలు వేసి వెళ్లారు. ఆదివారం సెలవు కావటంతో పాఠశాలను తెరవలేదు కాగా సోమవారం పాఠశాలకు వచ్చేసరికి తరగతి గది ముందు భాగం (పోర్టికో)లో ముగ్గు వేసి పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, ఎండు మిర్చి పెట్టి పూజలు చేసిన దృశ్యం కనిపించిందని తెలిపారు. స్థానికులకు విషయం తెపటంతో వారు వచ్చి చేతబడి కోసం చేసిన పూజలుగా ఉన్నాయని భావించి ఆప్రాంతాన్ని నీటితో శుభ్రం చేశారు. ఇది తెలుసుకున్న తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలకు పంపలేదు. కాగా ఎంఈవో సత్యనారాయణ పాఠశాలను పరిశీలించి ఉపాధ్యాయుడు, మధ్యాహ్న భోజన సిబ్బందిని వివరాలలు అడిగితెలుసుకున్నారు.

వంట చేస్తుండగా లారీ క్యాబిన్ దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

వైరా, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వైరాలో సోమవారం లారీ క్యాబిన్‌లో మంటలు వ్యాపించి దానివరకు పూర్తిగా కాలిపోయింది. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది మంటలార్పడంతో క్యాబిన్ వరకే కాలిపోయింది. రూ.రెండులక్షలకుపైగా నష్టం సంభవించింది. తౌడు లోడ్‌తో కోల్‌కత్తా నుంచి మిర్యాలగూడేనికి వెళ్తున్న లారీని మార్గమధ్యలో నిలిపారు. ఆసమయంలో క్యాబిన్‌లోనే వంట చేస్తుండగా మంటలు అంటుకొని క్యాబిన్ కాలిపోతుండగా ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందడంతో ఫైరింజన్‌తో సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలార్పారు. దాంతో ప్రమాదం తప్పిపోయింది. డ్రైవర్ నాగార్జున సురక్షితంగా బయటపడ్డారు. వైరా ఫైర్ ఆఫీసర్ అమరనేని శ్రీనివాసరావు, లీడింగ్ ఫైర్‌మెన్ వై.వీరభద్రం, డీవోపీ ఆర్.సురేష్‌కుమార్, ఫైర్‌మెన్ కె.వీరభద్రం, హోంగార్డులు ఎస్.ప్రకాశరావు, గోవిందరావు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

భద్రాచలం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని గోదావరిలో ఆదివారం గోదావరి వారధిపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధుడి మృతదేహం సోమవారం లభ్యమైంది. కొత్తగూడెంలోని కూలీలైన్లో నివాసం ఉంటున్న వేముల మల్లేష్(68)గా ఆత్మహత్యకు పాల్పడిన వృద్ధుడిని బంధువుల సమాచారంతో గుర్తించారు. గోదావరి వారధిపై నుంచి దూకిన వెంటనే మల్లేష్ ఆచూకీ లభించలేదు. అయినప్పటికీ గజ ఈతగాడు ప్రసాద్ సహకారంతో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో సోమవారం మల్లేష్ మృతదేహం లభ్యం కావడంతో భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాల మార్చురీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహం చేసుకోవాలని ప్రియురాలి ధర్నా

పెనుబల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రియుడి ఇంటిముందు ధర్నా చేస్తున్న యువతికి సోమవారం ఆగ్రామ మహిళలు మద్దతుగా నిలిచారు. మండాలపాడుకు చెందిన యువకుడు అదే గ్రామానికి చెందిన యువతిని ఏడేళ్లుగా ప్రేమిస్తున్నానని మోగిస్తూ పెళ్లి చేసుకోవాలని కోరగా నిరాకరించాడని అతడితో పెళ్లి జరిపించాలని సోమవారం ప్రియుడి ఇంటిముందు ప్రియురాలు ధర్నాకు దిగింది. ఆమె వెంట తల్లిదండ్రులతోపాటు ఆగ్రామానికి చెందిన మహిళలు మద్దతు ప్రకటించి నిరసన వ్యక్తం చేశారు. ప్రియుడితో తనకు వివాహం జరిపించాలని ప్రియురాలు కోరుతోంది.

బంగారం దుకాణంలో చోరీ

చర్ల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): చర్ల మండల కేంద్రంలోని భద్రాద్రి రామ బంగారు దుకాణంలో సోమవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. సుమారు రూ.6 లక్షల విలువైన వెండి, బంగారం ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఎప్పటిలానే దుకాణం మూసి వెళ్లామని, గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి మూడు కిలోలవెండి, 50గ్రాముల బంగారం పట్టుకుని పోయారని యజమాని తంగిళ్లపల్లి శంకరాచారి వాపోయారు. పోలీసులు దొంగలను పట్టుకోవాలని కోరారు. ఈదుకాణం పక్కనే ఉన్న మరో లక్ష్మి జ్యూవలరీ దుకాణంలో కూడా చోరీ చేసేందుకు దొంగలు ప్రయత్నించారు. స్థానికులు మేల్కోవడంతో పారిపోయారు.

లక్ష్మీనగరంలో చోరీయత్నం



చోరీ యత్నం జరిగిన దుకాణం

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగరంలోని ఝాన్సీ జ్యూయలరీ దుకాణంలో ఆదివారం రాత్రి చోరీ యత్నం జరిగింది. ఇనుప షట్టరును బలవంతంగా తెరిచిన దుండగులు దుకాణంలోని వెళ్లారు. దుకాణం వెనుక భాగంలో అద్దెకు ఉంటున్న వ్యక్తి అర్ధరాత్రి సమయంలో ఈ చప్పుడు ఏంటని బయటకు వచ్చాడు. అతడిని చూసిన దుండగులు దుకాణం ముందు నిలిపి ఉంచిన నెంబరు ప్లేటు లేని వాహనంలో పారిపోయారు. మొత్తం ముగ్గురు వ్యక్తులు వచ్చినట్లు సీసీ కెమెరాలో కనబడుతోండగా, ఒకడు బైట ఇనుప రాడ్డు పట్టుకొని కాపలా కాయగా ఇద్దరు దుకాణంలోకి వెళ్లారు. దుకాణంలోని లాకరులో సుమారు రూ1.50లక్షల వెండి వస్తువులనుంచగా, అవి క్షేమంగా ఉన్నాయి. ఐతే దుండగులు ఝాన్సీ జ్యూయలరీ ఎదురుగా ఉన్న మరో జ్యూయలరీ దుకాణం వైపు ముందుగా వెళ్లి పరిస్థితిని పరిశీలించినట్లు సీసీ కెమెరాలో రికార్డయ్యింది. క్లూస్ టీం సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

సీతారాంపురం చోరీపై కేసు నమోదు

సీతారాంపురంలో ఈనెల 15న సులేమాన్ అనే హోటల్ వ్యాపారి ఇంట్లో చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాత్రి 8.30 నుంచి 10.30 గంటల మధ్యలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగతనం జరిగింది. ఇంటి వెనుకగా ప్రవేశించిన దుండగులు బీరువాలోని పదకొండున్నర గ్రాముల బంగారు, 200 గ్రాముల వెండి ఆభరణాలు, రూ47వేల నగదు చోరీ అయ్యాయి.

విద్యుదాఘాతంతో పూరిల్లు దగ్ధం

పినపాక, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పినపాక మండలం సీతంపేట గ్రామానికి చెందిన పూస వెంకటేష్ పూరిల్లు విద్యుదాఘాతంతో కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న ఆదివాసీ సంఘం నాయకులు 25కిలోల బియ్యం, రెండు దుప్పట్లు అందజేశారు. జాతీయ ఆదివాసీ గిరిజన లభ్యుదయ సంఘం భద్రాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి గొగ్గల ఆర్కే. దొర, పినపాక మండల అధ్యక్షుడు కొమరం శ్రీను, ప్రధాన కార్యదర్శి కుర్సం సారయ్య ఉన్నారు. దగ్ధమైన గుడిసెను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరిశీలించారు.

డొక్కు బస్సులతో.. బిక్కు.. బిక్కు..



రోడ్డు రవాణా సంస్థలో నిర్వహణ లోపం

- మొరాయిస్తున్న ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులు
- ప్రయాణికుల సహనం పరీక్షిస్తున్న అధికారులు
- కాలంచెల్లిన బస్సులతో ఇక్కట్లు

ఖమ్మం ఖానాపురం హవేలి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ పాత ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులను రోడ్లపై తిప్పుతూ ప్రయాణికులకు ఇబ్బందులకు గురిచేస్తోంది. వాటి నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. సుఖవంతమైన ప్రయాణం పేరుతో నడుపుతున్న రాజధాని బస్సులు కూడా మొరాయిస్తున్నాయి. పేరుకే రాజధాని బస్సులు కాగా.. ఎప్పుడు ఎక్కడ ఆగుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. అన్నీ పాత బస్సులే కావడంతో ఈ సమస్య తలెత్తుతోంది.

ఖమ్మం నుంచి హైద్రాబాద్‌కు 24 రాజధాని బస్సు సర్వీసులు నడుస్తుండగా వాటంనీంటిని మార్చి కొత్త బస్సులను తీసుకొచ్చిన అధికారులు ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగుల విషయంలో మాత్రం పట్టించుకోవట్లేదనే వాదనలు వినపడుతున్నాయి. ఏసీ, సూపర్‌లగ్జరీ బస్సులనే కొత్త బస్సులు తీసుకురావటం, ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులను పాత బస్సులే నడపటంతో గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురైతున్నారు. వాటిలో ఎక్కువ శాతం పాత బస్సులే ఉండటంతో సమస్యలు వస్తున్నాయి. బుధవారం రాత్రి ఖమ్మం నుంచి ఇల్లెందు వెళ్లే ఇల్లెందు డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు రాత్రి 8.30 గంటలకు ఖమ్మం నగరంలోని ఇండస్ట్రీయల్ ఏరియాలో బ్రేక్‌డౌన్ కావటంతో సుమారు 50 మంది ప్రయాణికులు రెండు గంటలకు పైగా రోడ్లపైనే నిలిచిఉన్నారు. ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వెళ్లాలని భావించే ప్రయాణికులకు ఆర్టీసీ బస్సులు అశనిపాతమవుతున్నాయి. పేరుకే ఎక్స్‌ప్రెస్ బస్సులని, మార్గమధ్యలో ఎక్కడ ఆగుతాయో తెలియని పరిస్థితి ఉందని ప్రయాణికులు వాపోతున్నారు. ఖమ్మం నుంచి హైదరాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులో నిర్వహణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పాత బస్సు కావడంతో బ్రేక్ డౌన్ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఖమ్మం నగరానికి చెందిన ఓ వృద్ధురాలు ఆసుపత్రికి వెళ్లేందుకు బుధవారం రాత్రి ఖమ్మం నుంచి హైద్రాబాద్‌కు ఖమ్మం డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులో బయలుదేరాడు. ఖమ్మం టౌన్ దాటక ముందే ఆ బస్సు ఆగిపోయింది. దీంతో డ్రైవర్ బస్సు బ్రేక్‌డౌన్ అయిందని మరో బస్సులో ప్రయాణికులను ఎక్కించి పంపారు. దీనంతటికీ సుమారు రెండు గంటల సమయం పట్టిందని ప్రయాణికులు వాపోయారు.



పారిశ్రామిక ప్రాంతంలో బ్రేక్‌డౌన్ అయిన పల్లెవెలుగు బస్సు

వేసవిలో ఇక్కట్లు..

అసలే వేసవి కాలం.. అందులో దూర ప్రాంతాలకు ప్రయాణించేవారు ఎక్కడికక్కడే రోడ్లపై బస్సులు చెడిపోతుండటంతో ఇబ్బంది పడుతున్నారు. ఉక్కపోత, వేసవి వేడికి రోడ్లపై పడిగాపులు కాస్తున్నారు. బ్రేక్ డౌన్స్ అధిక మించేందుకు డిపో స్థాయిలో పూర్తి మరమ్మతులు చేస్తామని, రోడ్లపై చెడిపోయిన బస్సులకు క్షణాల్లో రిపేర్ చేస్తామని చెబుతున్న మాటలు అమలు కావడం లేదు. ట్రాఫిక్‌లో బస్సులు ఆగిపోతే సిబ్బందికి చుక్కలు కనబడతాయి. బస్సు అంగుళం కూడా ముందుకు కదలదు దీంతో క్షణాల్లో కిలో మీటర్ల దూరం ట్రాఫిక్ నిలిచిపోతుంది.

త్వరలోనే బస్సులను మారుస్తాం

సరిరాం ఆర్టీసీ రీజనల్ మేనేజర్

ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు నడిసే రాజధాని బస్సు సర్వీసులలో ఎక్కువగా కొత్త బస్సులే ఉన్నాయి. ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులే పాతవి. వాటి స్థానంలో కొత్త సర్వీసులను రీప్లేస్‌మెంట్ చేస్తాం. ఎండా కాలం కావటంతో ప్రయాణికుల అవసరాల కొద్దీ ఈ బస్సులను నడుపుతున్నాం. ఎక్కడైనా బస్సులు బ్రేక్‌డౌన్ అయితే వెంటనే మరో బస్సును ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. వర్షాకాలంలో కొన్ని బస్సులను రీప్లేస్‌మెంట్ చేసి వాటి స్థానంలో కొత్త బస్సులను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. రీజియన్ పరిధిలో ఏసీ, సూపర్ లగ్జరీ బస్సులన్నీ కొత్త బస్సులే.

ప్రజలు కేసీఆర్ పాలన కోరుకుంటున్నారు

- మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం చర్చికాంపౌండ్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల కాలంలోనే ప్రజలు కేసీఆర్‌లాంటి పరిపాలన దక్షకుడిని కోరుకుంటున్నారని మాజీమంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఖమ్మంనగరంలోని మమతా ఆస్పత్రిలో కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్‌కట్ చేసి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. అనంతరం పువ్వాడ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం కేసీఆర్ 35పార్టీలను ఏకం చేసి తెలంగాణ రాష్ట్రంసాధించారన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో స్ఫూర్తినిచ్చిన తెలంగాణ తల్లి విగ్రహంరూపాన్ని కూడా మార్చారని పువ్వాడ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో పేర్లు మార్పు తప్పితే ప్రజల జీవితాల్లో ఎటువంటి మార్పు రాలేదన్నారు. ఇప్పుడు తెలంగాణప్రజలు ఆలోచిస్తున్నారని, జరిగిన పొరపాటుకు చింతిస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ మాజీచైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు గుండాల కృష్ణ, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, బచ్చు విజయ్‌కుమార్, తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యాలయంలో..

కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఖమ్మంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో కేక్‌కట్ చేసి, మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఖమ్మంజిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు కేక్‌కట్ చేసి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీచైర్మన్ ఖమర్, రూరల్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, తాళ్లూరి జీవన్‌కుమార్, తాజుద్దీన్, ఉప్పల వెంకటరమణ, తోట వీరభద్రం, శీలంశెట్టి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌బీఐటీ కళాశాల ప్రాంగణంలో మొక్కను నాటుతున్న గుండాల కృష్ణ

కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో కేక్‌కట్‌చేసి, మొక్కలు నాటారు. రాజకీయాలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలను ఏకతాటిపై నిలిపి అసాధ్యమనుకున్న తెలంగాణ రాష్ట్ర సాధనను సుసాధ్యం చేసిన కేసీఆర్ మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలన్నారు. కేసీఆర్ పాలన కాలం రాష్ట్ర నిర్మాణంలో సువర్ణక్షరాలతో లిఖించదగిందన్నారు.

హాస్టల్‌లో మరమ్మతులపై కలెక్టర్ ఆరా

పాల్వంచ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పాల్వంచ లోని ఆశ్రమ పాఠశాల వసతి గృహాన్ని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సోమవారం సందర్శించారు. వసతి గృహంలో చేపడుతున్న మరమ్మతులపై ఆరా దీశారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహం, పాఠశాలలో చేపడుతున్న లైటింగ్, టాయిలెట్స్ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. విద్యార్థులు దుస్తులు ఆరవేసుకునేందుకు ఏర్పాటు చేసిన పైప్ ఫిట్టింగ్ పనులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు.

21న హమాలీ సంఘం రాష్ట్ర మహాసభలు

ఇల్లెందు టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాల్గో మహాసభలు ఖమ్మంలో 21వ తేదీన నిర్వహించనున్నట్లు టీయూసీఐ జిల్లా నాయకుడు పాయం వెంకన్న తెలిపారు. సోమవారం జీసీసీ వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హమాలీలకు, మిల్ వర్కర్లకు సమగ్ర చట్టాన్ని చేయాలని డిమాండ్ చేశారు.

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

పాల్వంచ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద మృతిపై పాల్వంచ టౌన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం పాల్వంచ మునిసిపాలిటీ పరిధిలోని పేటచెరువు గ్రామానికి చెందిన పుట్టల నరేష్(33) స్థానికంగా పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 10న మద్యం సేవించి అస్వస్థతకు గురవగా కుటుంబ సభ్యులు పాల్వంచలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. అంతా సవ్యంగా ఉందని భావించి ఇంటికి వెళ్లారు. అనంతరం మరుసటి రోజు ఉదయం మరలా అతనిడి పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో అంబులెన్స్‌లో పాల్వంచకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు 11వ తేదీన అతని అంత్యక్రియలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయం ప్రకారం సమాధి వద్ద నిర్వహించే కార్యక్రమంలో స్థానికుడైన బొజ్జా వెంకటేశ్వర్లు నరేష్ తాగిన మందు సీసాలో మిగిలి ఉన్న మద్యం సేవించాడు. అదే రోజు రాత్రి వెంకటేశ్వర్లు సైతం అస్వస్థతకు గురై ఆసుపత్రి పాలవడంతో నరేష్ తల్లికి అనుమానం వచ్చింది. ఈ క్రమంలోనే తన కుమారుడు నరేష్ తాగిన మందులో ఎవరో ఏదో కలిపి ఉంటారని, అతడి మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లి చుక్కమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాంనను. దీంతో తహసీల్దార్ వివేక్, పాల్వంచ టౌన్ ఎస్ఐ సుమన్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు రాంప్రసాద్ పేటచెరువులో మృతదేహాన్ని పాతిపెట్టిన స్థలానికి చేరుకుని పంచనామా చేశారు. అనంతరం వైద్యులు శవపరీక్ష నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

దృష్టి లోపం ఉన్న విద్యార్థుల గుర్తింపు

- డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్‌నాయక్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దృష్టి లోపం ఉన్న 2,103 మంది విద్యార్థులను గుర్తించామని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్ తెలిపారు. సోమవారం కొత్తగూడెం సర్వజన ఆసుపత్రిలో వైద్యాధికారుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా గతేడాది ఏప్రిల్ 2024 ఆగస్టు నుంచి నవంబరు వరకు రెండు విడతలుగా ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కంటి పరీక్షల నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 78,227 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా అందులో 2103మంది విద్యార్థులకు దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో రెండో విడతగా రెండు కంటి పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఇసుకాసురులపై ఉక్కుపాదం

- అక్రమ రవాణాపై పటిష్ఠ నిఘా
- ఆదేశాలు జారీచేసిన ఉన్నతాధికారులు
- ర్యాంపుల్లో సాగుతున్న తనిఖీలు
- అనుమతులు, ఓవర్ లోడింగ్‌పై నజర్



ఇసుక రీచ్ నిర్వాహకులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

కొత్తగూడెం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ఇసుక రీచ్‌పై ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణాపై ముఖ్యమంత్రి సీరియస్ కావడం జిల్లా కలెక్టర్, ఎస్పీలను చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమవుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుక ఉచితంగా ఇసుకను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునే లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుంటే వారికి మాత్రం ఉచితంగా ప్రభుత్వమే ఇస్తుంది.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఇసుక అక్రమ రవాణాపై నిఘా పూర్తిస్థాయిలో పెట్టి ఎట్టి పరిస్థితుల్లో రవాణా జరగకూడదని వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతులు లేకుండా వెళ్తున్న లారీలను సీజ్ చేయాలని, లారీలో అధిక లోడింగ్‌లో వెళ్తున్న లారీలను సీజ్ చేయాలని ఆదేశించారు. చర్ల ప్రాంతంలో ఆకస్మికంగా కలెక్టర్ అక్రమ ఇసుక రవాణాను స్వయంగా వెళ్లి పరిశీలించారు. అక్కడి రీచ్‌ల వద్ద పోలీసుల నిఘాను పటిష్ఠం చేశారు. ఎప్పటికప్పుడు చెక్‌పోస్టుల వద్ద నిఘాను ఏర్పాటు చేసి ఇసుక రవాణా చేస్తున్న లారీలను పరిశీలిస్తున్నారు. మొత్తం మీద అక్రమ ఇసుకను చెక్‌పెట్టేందుకు చర్యలు చేపట్టారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గోదావరి పరివాహక ప్రాంతాలైన భద్రాచలం పినపాక డివిజన్‌లో ఇసుక రీచ్ ఏర్పాటు ప్రక్రియ ఆదివాసీల సొసైటీ నిర్వాహకులకు, కార్యవర్గసభ్యులకు మధ్య చిచ్చుపెట్టినట్లైంది. పినపాక డివిజన్‌లో 8, భద్రాచలం డివిజన్‌లో 9 ర్యాంపుల ఏర్పాటు విషయంలో ఆదివాసీ నిర్వాహకులు కార్యవర్గ సభ్యుల మధ్య ప్రజాభిప్రాయ సేకరణలో విభేదాలు తలెత్తాయి. ఏజెన్సీలో ఆదివాసీ సొసైటీలతోనే ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయాలని గిరిజన సొసైటీలకు అనుమతులు ఇచ్చిన ప్రభుత్వం కొంత రాయాల్టీ పొందే అవకాశం ఉంది. సొసైటీలో గతంలో కొంతమంది బినామీకాంట్రాక్టర్లు చోటుచేసుకుని ఇసుక రీచ్‌లను తగ్గించుకుని ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇప్పుడు కూడా అలాగే చేద్దామనే ఆలోచనలో ఉన్నారు. మొత్తం పినపాక, సాంబయ్యగూడెం, బూర్గంపాడు, దుమ్ముగూడెం, గోదావరి ఒడ్డు ప్రాంతాల్లో ఇసుక వ్యాపారాన్ని తెరలేపేత్తేందుకు సర్వంసిద్ధం చేసుకున్నారు.

మొత్తం మీద భద్రాచలం డివిజన్‌లో చర్ల, బూర్గంపాడు, భద్రాచలం, దుమ్ముగూడెం తదితర ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక రవాణా చేపట్టకుండా ఉండేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తమయింది. గతంలో చర్ల ప్రాంతంలో టీఎస్ఎండీసీ అధికారులు మొగళ్లపల్లి, వీరాపురం ఇసుక ర్యాంపులను తనిఖీ చేశారు. ఇక్కడి నుంచి ఓవర్‌లోడ్‌తో ఇసుక తరలుతున్న ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీలను చేసినట్లు సమాచారం. జిల్లాలో కిన్నెరసాని, ముర్రేడు, గోదుమవాగు, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, అనిశెట్టిపల్లి, టేకులపల్లి తదితర ప్రాంతాల్లోని అనధికారికంగా ఉన్న ఇసుక వాగుల్లో అక్రమంగా రవాణా జరుగుతోంది.

ఫోర్జరీ రిజిస్ట్రేషన్‌పై పోలీసులకు ఫిర్యాదు

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రూరల్ మండలంలో ఫోర్జరీ సంతకాల దందా పెద్దఎత్తున సాగుతోందనే అరోపణలున్నాయి. తాజాగా తన సంతకాన్ని ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్‌కు పత్రాలు సృష్టించారని ఓ పంచాయతీ కార్యదర్శి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓ ఐఏఎస్ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి మండలంలో సుమారు 200 ఎకరాల రియల్ ఎస్టేట్ భూములకు ల్యాండ్ కన్వర్షన్లు, సుమారు 500 ఇళ్లకు అనుమతులు ఇచ్చి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టారంటే ఫోర్జరీ రాయుళ్ల దందా ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ దందా ఇప్పుడు రూరల్ సబ్‌రిజిస్టార్ కార్యాలయంలోకి చేరుకుంది. సబ్‌రిజిస్టార్ కార్యాలయంలో ఫోర్జరీ సంతకాలతో రిజిస్ట్రేషన్ల దందా సాగుతోంది. ఈ ఫోర్జరీ దందాపై 'ఆంధ్రజ్యోతి'లో పైసలిస్తేనే పని.. ఫోర్జరీ సంతకాలతో ఇళ్ల రిజిస్ట్రేషన్లు అనే శీర్షికతో కథనం సోమవారం ప్రచురితమైంది. ఈ కథనానికి జిల్లా ఉన్నతాదికారులు స్పందించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి దందాపై విచారణ చేపట్టినట్లు విశ్వసనీయ సమాచారం.

పోలీసులకు ఫిర్యాదు

రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి సమర్పించిన డాక్యుమెంట్లతో ఓ ఇల్లు రిజిస్ట్రేషన్ అయింది. మండలంలోని తెల్దారుపల్లి గ్రామంలో సదరు ఇళ్లు ఉన్నది. 2022లో ఇంటి ధ్రువీకరణ పత్రంతో రిజిస్ట్రేషన్ కావడంతో ఆనాడు గ్రామంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి రాధారాణి తాను పనిచేసిన సమయంలో ఎవరికీ ఇంటి ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదన్నారు. తన సంతకాన్ని ఫోర్జరీ చేసి కొందరు వ్యక్తులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించారని సోమవారం రూరల్ ఇన్‌స్పెక్టర్‌కు రాధారాణి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

తన సంతకాన్ని ఫోర్జరీ చేసిన వారిని విచారించి వెంటనే అరెస్టు చేయాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పంచాయతి కార్యదర్శి



మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి: సీపీఎం

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో మిర్చిబోర్డు ఏర్పాటు చేయాలని, క్వింటా మిర్చికి రూ.25 వేలు ధర నిర్ణయించి ప్రభుత్వమే నేరుగా పంటను కొనుగోలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కాచిరాజుగూడెం గ్రామంలో సోమవారం మిర్చి కల్లాలను పరిశీలించారు. రేపు రైతుసంఘం ఆధ్వర్యంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ దగ్గర జరగబోయే రైతు ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేలాద్రి, వెంకన్న, వెంకటరమణ, గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	20
గుత్తి వంకాయ	36
బీరకాయ	48
పచ్చిమిర్చి	34
బెండకాయ	44
బెండకాయ	44
పొట్లకాయ	44
దోసకాయ	34-44
చిక్కుడు	38
నాటుచిక్కుడు	70
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	20
దొండ	28-36
సొరకాయ	18
క్యారెట్	34
క్యాప్సికం	48
ఆలుగడ్డ	26
ఉల్లిగడ్డ	40-45
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	150
కొత్తిమీర కట్ట	10

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	తండేల్
శ్రీనివాస:	డాకూ మహరాజ్
సాయిరాం:	పట్టుదల
కేపీఎస్:	ఒక పథకం ప్రకారం
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సినీగెలాక్సీ:	డియర్ కృష్ణా

మండ్రాజుపల్లి సొసైటీ అధ్యక్షుడిగా నర్రా

అధ్యక్షుడు తోట వెంకటరావు రాజీనామాతో ఎన్నిక

నేలకొండపల్లి, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మండ్రాజుపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన అధ్యక్షుడిగా నర్రా పూర్ణచందర్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన ఈసంఘం ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. తన పదవీకాలం పూర్తి గావటంతో అధ్యక్షుడు తోట వెంకటరావు ఈనెల 14న అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం సహకార సంఘాలకు 6నెలలు గడువు పెంచటంతో మండ్రాజుపల్లి సొసైటీకి అధ్యక్ష ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఉపాధ్యక్షుడిగా ఉన్న నర్రా పూర్ణచందర్‌రావు అధ్యక్షుడిగా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సొసైటీ డైరెక్టర్లు, వివిధ పార్టీల నాయకులు, రైతుల సమక్షంలో సోమవారం సొసైటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పూర్ణచందర్‌రావు, మాజీ అధ్యక్షుడు తోట వెంకటరావు నుంచి బాధ్యతలను స్వీకరించారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు వెంకటరావు, కార్యదర్శి సన్నాయిల పరమేశ్వరరావు పూర్ణచందర్‌రావును అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, ఏఎంసీ మాజీ చైర్మన్లు సూరపనేని రామకృష్ణ, శాఖమూరి రమేష్, సీడీసీ మాజీ చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు నెల్లూరి భద్రయ్య, మాజీ ఎంపీపీ వజ్జా రమ్య, రాజేశ్వరపురం, రాజారాంపేట సొసైటీ అధ్యక్షులు తన్నీరు కృష్ణమూర్తి, ధరావత్ బాలాజీ, రాజేశ్వరపురం సొసైటీ కార్యదర్శి వీరబాబు పాల్గొన్నారు.



బాధ్యతలు తీసుకుంటున్న నర్రా

విద్యార్థులకు కంటి పరీక్షలు

- ప్రభుత్వ పాఠశాలల్లో ఆరోగ్య పరిరక్షణపై చర్యలు
- 15రోజుల పాటు విద్యార్థులకు పరీక్షలు

ఖమ్మంకలెక్టరేట్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం కంటి పరీక్షలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వివిధ పాఠశాలలకు చెందిన 150మంది విద్యార్థులకు పరీక్షలను నిర్వహించారు.దీంతో జిల్లాలో 1332పాఠశాలలకు చెందిన 3,300 మందికి పక్షంరోజుల పాటు ఈ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఆప్తాలమి హెచ్‌వోడీ రామూనాయక్ తెలిపారు. జిల్లాలో రెండు విడతలుగా విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహించారు. ఈరెండు విడతల్లోనూ ఆయాపాఠశాలల పరిధిలో విద్యార్థులకు ఆప్తాలమీ టెక్నీషియన్లు నిర్వహించి విద్యార్థుల్లో లోపాలను గుర్తించారు. వారిలో 3,300 మందికి కంటికి సంబంధించిన వివిధ సమస్యలున్నట్లు గుర్తించారు.వారికి మరోమారు పరీక్షలను నిర్వహించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. లోపాలు గుర్తించిన విద్యార్థులకు మరోమారు పరీక్షలు నిర్వహించి నివేదికలను పంపిస్తారు. వాటి ఆధారంగా కళ్లజోళ్లు అవసరం ఉంటే వాటిని అందించనున్నారు. ఇంకా లోపాలు ఉంటే చికిత్సల కోసం హైదరాబాద్‌కు పంపించనున్నట్లు తెలిపారు. సోమవారం ఒక్కరోజే 150మంది చిన్నారులకు పరీక్షలను నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్ కిరణ్‌కుమార్ పరిశీలించారు. వైద్యులు రామూనాయక్, ఆయేషా, ఆర్బీఎస్కే వైద్యులు రామకృష్ణ ఉన్నారు.



విద్యార్థులకు కంటి పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు

సుబాబుల్ రైతులకు న్యాయం చేయాలి

- కలెక్టర్‌ను కోరిన రైతుసంఘాల నాయకులు
- విచారణ జరుపుతామని హామీ

ఖమ్మంకలెక్టరేట్,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): సుబాబులు, జామాయిల్ పంటలపై కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడి రైతుకు రేటును ఇవ్వడం లేదని అఖిలపక్ష నాయకులు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు విన్నవించారు. రూ. 1000 నుంచి రూ.1300 వరకు కంపెనీలు సిండికేట్ గా ఏర్పడి తగ్గించాయని కలెక్టర్‌కు తెలిపారు. అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను సోమవారం ప్రజావాణిలో కలిసి వినతిపత్రాన్ని అందించారు. అటవీశాఖ నుండి రూ.11,150కు కొనుగోలు చేస్తున్నారని, కేవలం రైతుల వద్ద మాత్రమే ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నాయని వివరించారు. ఈ మూడు కంపెనీలు సిండికేట్‌గా ఏర్పడటం మూలాన రైతులు నష్టపోతున్నారని వివరించారు. స్పందించిన కలెక్టర్ రేటు తగ్గించి కొనుగోలు చేస్తున్న తీరుపై విచారణనిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పొన్నం వెంకటేశ్వరావు, సీపీఐ గోవింద రావు, ఆడప రామకోటయ్య, దొండపాటి రమేష్, భారతీయ జనతా పార్టీ నుంచి ఏలూరి నాగేశ్వరరావు, టీఆర్ఎస్ నేత చింపు విజయ్, సుబాబుల జామాయిల్ రైతు పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు వట్టికుండ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నలమోతు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కర్నాటి రాజేంద్రప్రసాద్, కమిటీ సభ్యులు వేములపల్లి సుధీర్ తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.



సమస్యను వివరిస్తున్న రైతుసంఘం నాయకులు

'అన్నం' ఫౌండేషన్‌కు అధ్యాపకుల వితరణ

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్‌కు ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీకళాశాల హిందీ, మైక్రో బయోలజీ అధ్యాపకులు 50కేజీల బియాన్ని వితరణగా అందించారు. సోమవారం విద్యార్థులు అన్నం ఫౌండేషన్‌కు వెళ్లి ఫౌండేషన్ చైర్మెన్ శ్రీనివాసరావుకు బియ్యాన్ని అందించారు.చదువుతోపాటు సామాజిక సేవ, నైతిక విలువలు అలవర్చుకోవాలని అన్నం శ్రీనివాసరావు సూచించారు. పలు అంశాలపై అవగాహక కల్పించారు. వితరణ అందించిన అధ్యాపకులను, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు అనితాకుమారి, గౌస్ షేక్, మధు పాల్గొన్నారు.

తక్షణమే జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు అప్పగించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు కేటాయించిన 23ఎకరాల స్థలాన్ని తక్షణమే జర్నలిస్టులకు అప్పగించి స్థలాలు పంపిణీ చేయాలని జర్నలిస్టు యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా జర్నలిస్టులు సొంతింటి కోసం ఎదురుచూస్తున్నారని, గతంలో కేటాయించిన 23 ఎకరాల స్థలాన్ని జర్నలిస్టులకు ఇవ్వాలని విన్నవించారు. ప్రభుత్వం వెంటనే భూమిని అప్పగించాలని కోరారు. ఈకార్యక్రమంలో వివిధ యూనియన్ల జర్నలిస్టులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిరక్షణకు కృషి

ఖమ్మంఖానాపురంహవేలి ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, ఉపాధ్యాయుల హక్కులను కాపాడేందుకు కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. సోమవారం నగరంలో ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటుతో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

20న 'చలో హైదరాబాదు'

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న ఎన్నికలలో కాంగ్రెస్‌ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకోసం నిర్వహించే చలో హైదరాబాదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బజ్జూరి వెంకటరామిరెడ్డి, ఖమ్మం డివిజన్ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మంనగరంలో భారీ మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు షేక్ ఖాసీం, ఎం.గిరి, ఐ.వెంకన్న, శీలం సుదర్శన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

త్రివేణి విద్యాసంస్థలకు 'ఛాత్రలయ పురస్కార్' ప్రదానం



ఖమ్మంఖానాపురంహవేలి ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో చేస్తున్న కృషికి సుచిర్ ఇండియా ఫౌండేషన్ త్రివేణి విద్యాసంస్థలకు ఛాత్రలయ పురస్కార్ (బెస్ట్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్) అవార్డును అందంచారు. ఆదివారంరాత్రి హైదరాబాద్‌లోని లలిత కళాతోరణంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సినీనటుడురావు రమేష్ హాజరై విద్యా సంస్థల డైరెక్టర్ గొట్టపూడి వీరేంద్రచౌదరికి అందించారు.

వైభవంగా 16 రోజుల పండుగ

నేలకొండపల్లి,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోనాయగూడెంలో శ్రీఆంజనేయస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు జరిగి 16 రోజులు పూర్తైన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం 16 రోజుల పండుగను వైభవంగా నిర్వహించారు. సంప్రోక్షణ, విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. పురోహితుడు ఇంగువ రామకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పాల పొంగళ్ళు సమర్పించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి, నైవేద్యం సమర్పించారు. భక్తులకు పులిహోర, పానకం వితరణ చేసారు.

మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి

సీపీఐ రాష్ట్రకంట్రోల్‌కమిషన్ చైర్మన్ మౌలానా

ఖమ్మంరూరల్,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మిర్చిపంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ రాష్ట్రకంట్రోల్‌కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ముత్తగూడెం గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పంట పండించినరైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మిర్చికి గిట్టుబాటు దర కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంకోటి, శంకరయ్య, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులను గుర్తించండి

జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య

ఖమ్మంరూరల్,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమకారుల పాత్ర ఎంత అయితేఉందో, కాంగ్రెస్ ప్రభుత్వం రావడంలోనూ అంతే పాత్ర కనబరిచిన ఉద్యమకారులను గుర్తించాలని తెలంగాణ ఉద్యమ కారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల సోమయ్య అన్నారు. మండల పరిధిలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఆటోనగర్‌లో జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ చేసిన తప్పిదాలనే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా చేస్తే ఉద్యమకారుల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. అనంతరం రాష్ట్ర పదవి పొందిన బత్తుల సోమయ్య కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లయ్య, రాష్ట్ర నాయకులు కృష్ణ, రాములు, అఫ్జల్, వీరబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తులను కాజేసే కుట్ర జరుగుతోంది

- ఇస్లాం ధార్మిక పండితుడు ఘనీ

ఖమ్మంఖానాపురంహవేలి,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): పాలకుల కన్ను వక్ఫ్ ఆస్తులపై పడిందని, వాటిని కాజేయటానికి ప్రభుత్వం ఆధ్వర్యంలో కుట్ర జరుగుతుందని ఇస్లాం ధార్మిక పండితుడు మహ్మద్ అబ్దుల్ ఘనీ ఆరోపించారు. మన పూర్వీకులు ఏ ఉద్దేశంతో ఆస్తులను వక్ఫ్ చేశారో ఆలక్ష్యం నెరవేరే పరిస్థితి లేదన్నారు. సోమవారం నగరంలోని గొల్లగుడెం తాలీమాల్ ఇస్లాం మదర్సా వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆధ్యాత్మిక సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఇంతకాలం చెడు వ్యసనాలకు అలవాటు పడి సంప్రదాయాలను నిర్లక్ష్యం చేసిన ప్రతీ వ్యక్తి జీవిత చరమాంకాన్ని గుర్తెరిగి ఇకపై ఇస్లాం సూచించిన పద్ధతుల ప్రకారం జీవించటానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రేపటి తరం పిల్లలకు ఇస్లాం విద్యతో పాటు ఇంగ్లీష్ మీడియం పాఠ్యాంశాలను బోధించే ఇటువంటటి మదర్సాలను ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా మదర్సా విద్యార్థులు వరకట్న దురాచారం పైన, ఇస్లామిక్ విద్యాసంస్థల ప్రాముఖ్యం పై రూపొందించిన పలు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఖురాన్ కంఠస్థం చేసిన 12మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఆధ్యాత్మిక ప్రసంగకర్త ముఫ్తీ సులేమాన్ అజ్మల్, మౌలానా సయిద్ అహ్మద్ ఖాస్మీ, మౌలానా ముఫ్తీ మహ్మద్ జలాలుద్దీన్, ఉలేమాలు, ట్రస్ట్‌సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అబ్దుల్ ఘనీ

కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాటం

ఖమ్మంఖానాపురంహవేలి,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): దేశానికి సోసలిజమే ప్రత్యామ్నాయమని చాటి చెప్పాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, నున్నా నాగేశ్వరరావులు పిలుపునిచ్చారు.సోమవారం నగరంలోని సుందరయ్య భవనంలో నిర్వహించిన సీపీఐ(ఎం) సెంటర్‌శాఖల సమావేశంలో వారు మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల మతతత్వ అజెండాలకు వ్యతిరేకంగా ఇండియా బ్లాక్ సహకరించాలని అన్నారు. హిందుత్వ మతతత్వంతో రాజీపడే విషయాల్లో కాంగ్రెస్‌తోనూ విభేదించాలన్నారు. ప్రజా సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. మహిళా, గిరిజన,దళిత, విద్యార్థి, యువజన సమస్యలను దృష్టిలో ఉంచుకోని ఉద్యమాలకు రూపకల్పన చేయాలని పోతినేని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, సీనియర్ నాయకులు అలవాల నాగేశ్వరరావు, సెంటర్ శాఖ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పోతినేని

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.భారీకేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ఆసుపత్రిలో రోగులకు పాలు,పండ్లు పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వీరన్న, నాయకులు బోడమంచానాయక్, కొప్పుల శ్రీను, ఆలస్యం నాగేశ్వరరావు, బుజ్జి, బానోతు రవి, బి.వెంకటేశ్వర్లు, తాతా రవీందర్, పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: మండల పరిధిలోని కస్నాతండాలో మిర్చి కల్లంలో మిర్చిపంటతో కేసీఆర్ పేరు హ్యాపీబర్త్‌డే అని రాసి కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్రా వెంకటవీరయ్య కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు యండపల్లి వరప్రసాద్, లక్ష్మణ్, కృష్ణారావు, మట్టా వెంకటేశ్వర్లు, నారాయణ, సతీష్ పాల్గొన్నారు.

కామేపల్లి: కొత్తలింగాల కోటమైసమ్మ ఆలయంలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. అనంతరం ఆలయం ఎదుట గుర్తుగా మామిడిమొక్కలను నాటారు. మూడ్ క్రిష్ణప్రసాద్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కేసీఆర్‌నే సీఎం అవుతాడని అన్నారు. ఇప్పటి నుంచే కార్యకర్తలు కార్యక్రమాలలో పాల్గొనాలని సూచించారు. నెమలిపురి గ్రామంలో వేడుకలను జరిపారు. ఈకార్యక్రమంలో మూడ్ క్రిష్ణప్రసాద్, అంతోటి అచ్చయ్య, మల్లెంపాటి శ్రీనివాసరావు, సామా మోహన్‌రావు, కాట్రాల రాంబాబు, చిన్నవెంకటేశ్వర్లు, ఆదూరిప్రసాద్, సీహెచ్ శ్రీనివాసరావు, రామక్రిష్ణ, ఉదయ్, సాయి, కన్నమాల రాంబాబు పాల్గొన్నారు.



మిర్చిపంటతో కేసీఆర్‌కు జన్మదిన వేడుకలు తెలుపుతున్న నాయకులు





కొత్తలింగాలలో మామిడి మొక్క నాటుతున్న బీఆర్ఎస్ శ్రేణులు, తిరుమలాయపాలెంలో..

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలి

మేధావుల సంఘం చైర్మన్ చిరంజీవులు

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలు సత్తాచాటే సమయం వచ్చిందని రిటైర్డ్ ఐఏఎస్ మేధావుల సంఘం చైర్మన్ చిరంజీవులు అన్నారు. సోమవారం నగరంలోని సీవీఆర్ ఫంక్షన్ హాల్లో బీసీ సంఘాల ఐక్యవేదిక సమావేశం మున్నూరుకాపు సీనియర్ నాయకులు గుండాల కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా చిరంజీవులు మాట్లాడుతూ ఇటీవల తెలంగాణలో జరిగిన జనగణన బీసీల జనాభాను తగ్గించి ఓసీల జనాభాను పెంచినట్లుగా ఉందన్నారు. 8శాతం ఉండాల్సిన ఓసీ జనాభా 13శాతం పెంచి, 56 శాతం ఉన్న బీసీ జనాభాను 46శాతానికి తగ్గించినట్లు ఉందన్నారు. బీసీలు అందరూ ఏకమై హక్కుల సాధనలో రాజీలేని పోరాటం చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపించి ఆత్మగౌరవాన్ని చాటాలని సూచించారు. ఈ సమావేశంలో బీసీ నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు, బొమ్మా రాజేశ్వరరావు, కత్తి నెహ్రూగౌడ్, పసుపులేటి నాసరయ్య, షేక్ షకీనా మాటేటి కిరణ్, కెవి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన బీసీ నాయకులు

కంటిచూపును నిర్ధారించి కళ్లజోళ్లు అందిస్తాం

» డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ తలారి సీతారాం



విద్యార్థిని పరీక్షిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): 15రోజుల పాటు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి శుక్లాలు, కంటిచూపును నిర్ధారించి విద్యార్థులకు కళ్లజోళ్లు ప్రభుత్వం పంపిణీ చేయనున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ తలారి సీతారాం తెలిపారు. ఆరోగ్య సంరక్షణలో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యార్థులకు ఆప్తాలమోస్కోపీ పరికరం ద్వారా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను పరీక్షించారు. పుస్తకాన్ని చూస్తూ చదవలేకపోయినా, తలనొప్పి వచ్చినా పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే.వెంకటేశ్వర్లు, ఆర్‌బీఎస్‌కే వైద్యులు అజహార్, సాయి, మణి, ఆప్తమాలజిస్ట్ సదానందం, ఫార్మాసిస్ట్ కే.ప్రవీణ్‌కుమార్, నాగరాజు, రాధాకృష్ణకుమారి, హెచ్ఎన్ హైమావతి, ఏఎన్ఎం శివపార్వతి, సిబ్బంది రామారావు, నాగరాజ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే విద్యార్థుల మధ్య ఘర్షణలు

» ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బెజవాడ సాయిశేషు



సమావేశంలో మాట్లాడుతున్న సాయిశేషు

పెనుబల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీ సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణకు కారణం అధికారుల నిర్లక్ష్యమేనని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బెజవాడ సాయిశేషు ఆరోపించారు. సోమవారం వీఎంబంజర్‌లో ఎస్ఎఫ్ఐ మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సీనియర్లు, జూనియర్లుగా విడిపోయి పరస్పరం దాడులు చేసుకుంటుంటే అధికారులు లేకపోవడం వల్లనే విద్యార్థి గాయపడ్డాడని ఆరోపించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘర్షణలు జరుగకుండా అధికారులు బాధ్యత వహించాలని ఆయన కోరారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ఈలప్రోలు మణికంఠ, మండల అధ్యక్ష, కార్యదర్శులు బాణోతు శ్రీకర్, స్వామి, కల్లూరు మండల అధ్యక్షుడు ప్రేమ్, కార్తీక్ పాల్గొన్నారు.

దశరథ్‌కు సన్మానం

పెనుబల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గోర్‌బంజారా జాతీయరత్న అవార్డు గ్రహీత దశరథ్‌నాయక్‌ను బంజార సంఘం నాయకుడు ధర్మావత్ మంగూనాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలోని పొరియాగార్డ్‌లో గోర్‌బంజార జాతీయరత్న అవార్డు సేవాలాల్ మహరాజ్ భక్తులు, రామ్‌రాజ్ మహరాజ్ పాదాల దగ్గరి నుంచి వారి వారసులు బాపూసింగ్ మహరాజ్, శేఖర్ మహరాజ్, జితేంద్రసింగ్ మహరాజ్, బోజూమహరాజ్, కృష్ణనాయక్ దశరథ్‌నాయక్‌ను తెలంగాణ రాష్ట్రం నుంచి ఈ అవార్డుకు ఎంపిక చేయటం అభినందనీయమన్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గుగులోతు కృష్ణనాయక్, బిక్కు, శ్రీను, భద్రు, సోనీ, లక్ష్మి, రుక్మిణి, పద్మ పాల్గొన్నారు.

వేసవిలో విద్యుత్ సమస్యలను అధిగమించేలా..

» సబ్‌స్టేషన్ల పరిధిలో రూ.1.10 కోట్లతో ఆధునికీకరణ పనులు



కొత్త స్తంభాలు వేయిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

కల్లూరు, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): వేసవిలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలతో పాటుగా గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఏలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా కల్లూరు మండలంలోని విద్యుత్‌శాఖ అధికారులు తగిన విధంగా అవసరమైన ఆధునికీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా మండలంలోని కల్లూరు, పెద్దకోరుకొండి గ్రామాల పరిధిలోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఈ ఏడాది రూ.1.10 కోట్ల అంచనాతో ఆధునికీకరణ పనులు చేపట్టారు. అందులో భాగంగా అధిక లోడింగ్ తట్టుకునేలా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, సింగిల్ లైన్ నుంచి త్రిఫేజ్ లైన్ ఉన్నతి, ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను తొలిగించి ఎత్తు పెంచడం, కొత్త స్తంభాల ఏర్పాటు, అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు వంటి తదితర ఆధునికీకరణ పనులను ఇప్పటికే విద్యుత్ అధికారులు చేపట్టారు. కల్లూరు పట్టణంలో 100 కేవీఎల్ ట్రాన్స్‌ఫార్మర్లు-8, 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు-1, 63 కేవి-1 ఏర్పాటు చేయగా గ్రామాల్లో 25 కేవీ సింగల్ ఫేజ్ ట్రాన్స్ ఫార్మర్లు-15 ఏర్పాటు చేశారు. గత జనవరి నెల నుంచి కల్లూరు, పెద్దకోరుకొండి సబ్‌స్టేషన్ల పరిధిలో గల గ్రామాల్లో విద్యుత్‌శాఖ సబ్‌ఇంజనీర్లు వెంకట్, రామిరెడ్డిల పర్యవేక్షణలో ఆయా పనులను చేయిస్తున్నారు.

ఇప్పటికే 90 శాతం పనులు పూర్తి అయ్యాయి. విద్యుత్ సమస్యలను అధికమించేలా విద్యుత్‌శాఖ తరుపున రూ.1.10 కోట్ల అంచనాతో చేపట్టిన ఆధునికీకరణ పనులతో ఇకపై రానున్న వేసవి కాలం నుంచి విద్యుత్ శాఖ ద్వారా వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన విద్యుత్ సరఫరా జరగనున్నది.

విద్యుత్ సరఫరాలో సమస్యలు ఉండవు

● వెంకట్, విద్యుత్‌శాఖ సబ్ఇంజనీర్, కల్లూరు



విద్యుత్ సమస్యలను అధికమించేలా తగిన కార్యచరణ ప్రణాళికతో అవసరమైన విధంగా అభివృద్ధి పనులు చేశాం. పెరుగుతున్న జనాభా, విస్తరించిన విద్యుత్ సర్వీస్‌ల పరిధిని దృష్టిలో ఉంచుకొని అవసరమైన విధంగా సాంకేతిక మరమ్మతులు చేయడం జరిగింది. దీంతో వ్యవసాయ, గృహ, పారిశ్రామిక వినియోగదారులకు ఇక విద్యుత్ సమస్యలు ఉండవు. ఇప్పటికే కల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోనే సుమారు రూ.1 కోటి అంచనాతో నియంత్రికలు, కొత్త స్తంబాలు వేయటం, ప్రమాదకరంగా ఉన్న వాటిని తొలిగించి వాటి స్థానంలో ఎత్తును పెంచి నూతను ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నాం. వినియోగదారులకు మెరుగైన విధంగా విద్యుత్ సరఫరా చేస్తాం.

ఒలింపియాడ్ విజేతలకు అభినందనలు



రావు రమేష్ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న విద్యార్థి

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సుచిరిండియా ఫౌండేషన్ సర్ సివి రామన్ సభ్యులు గతేడాది డిసెంబర్ 28న నిర్వహించిన రాష్ట్రస్థాయి ఒలింపియాడ్‌లో సత్తుపల్లికి చెందిన వీవీ.విద్యాలయం విద్యార్థులు పాల్గొనగా విజేతలను సోమవారం హైదరాబాద్‌లో అబినందించారు. లలిత కళాతోరణంలో నిర్వహించిన అభినందన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, లయన్ డాక్టర్ వై.కిరణ్, సినీనటుడు రావు రమేష్‌ల చేతులమీదుగా అవార్డును అందుకున్నట్లు ప్రిన్సిపాల్ వంశీకృష్ణ తెలిపారు. 1వ తరగతి విద్యార్థి జీ.రచిత్, 5వ తరగతి విద్యార్థి ఎస్ కే.అస్పియాలు ప్రతిష్టాత్మక యంగ్ జీనియస్ అవార్డును గెలుచుకుని వరుసగా జిల్లా 2వ, మొదటి ర్యాంక్‌ను సాధించారన్నారు.



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేస్తున్న రవికుమార్

పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

కొణిజర్ల, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో బాగా చదివి మంచి జీపీఏ సాధించాలని చేతనా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వెనిగల్ల రవికుమార్ కోరారు. సోమవారం మండల పరిధిలోని పెద్దగోపతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు చేతనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్యాడ్, పెన్నులు, స్కేల్, పెన్సిల్‌లను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు, కోపెల మార్క్, ఫౌండేషన్ అధ్యక్షుడు వెనిగళ్ల అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు మాదినేని నరసింహరావు, షేక్ రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అపార్ డేటా ఎంట్రీ

కల్లూరు, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో విద్యార్థుల అపార్ డేటా ఎంట్రీ కార్యక్రమం చురుకుగా సాగుతుంది. ఈ విద్యాలయంలో 5 నుంచి ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికలకు సంబంధించి అపార్ నమోదు ప్రక్రియ జరుగుతుంది. విద్యాలయంలో 608 మంది బాలికలు ఉండగా, 379 మందికి అపార్ నమోదు పూర్తి అయ్యిందని ప్రిన్సిపాల్ కనకదుర్గ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీతారెడ్డి, పాల్గొన్నారు.

'ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

కారేపల్లి, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ బీసీ హాస్టల్ నిర్మాణం కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలంలో సోమవారం కొంతమంది వ్యక్తులు అనుమతులు లేకుండా కట్టడాలు చేపట్టారని, అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని కోరుతూ పలువురు నాయకులు తహసీల్దార్ ఎస్.సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిర్మాణాలు చేపట్టినవాటిని సంబంధిత అధికారులు తొలగించాలని కోరారు.

మిర్చి రైతుల మహాధర్నాను జయప్రదం చేయండి

» తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మిర్చి మద్దతు ధర కోసం మంగళవారం రైతుల మహాధర్నా నిర్వహిస్తామని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు తెలిపారు. సోమవారం వైరాలో జరిగిన రైతుసంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంలో జరిగే మిర్చి రైతుల మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లెంపాటి రామారావు, చింతనిప్పు చలపతిరావు, బొంతు సమత, దొడ్డపనేని కృష్ణార్జున్‌రావు, నారికొండ అమరేంద్ర, వడ్లమూడి మధు, చలపతిరావు తదితరులున్నారు.

పెనుబల్లిలో...

పెనుబల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మిర్చి క్వింటాకు రూ.25వేల ధర నిర్ణయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేయాలని, తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడు అరుణ ప్రతాప్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు గాయం తిరుపతిరావు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రంగారావుబంజర్‌లో మిర్చికల్లాలు, తోటల్లో పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సాంబారు రామ్మూర్తి, సత్యం, రామారావు, ఓరుగంటి రామకృష్ణ, తంబోజు వెంకటేశ్వర్లు, పడిగల సత్యం, వెంకన్న, మువ్వా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పెనుబల్లిలో మాట్లాడుతున్న నాయకులు

బోనకల్‌లో...

బోనకల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో మిరప బోర్డును ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతుసంఘ జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని లక్ష్మీపురం, తూటికుంట్ల గ్రామాలలో సోమవారం రైతుసంఘం ఆధ్వర్యంలో మిరప తోటలను పరిశీలించారు. దొండపాటి నాగేశ్వరరావు, తుళ్లూరి రమేష్, కొమ్మినేని నాగేశ్వరరావు, గుడ్దూరి ఉమ, నరేష్ పాల్గొన్నారు.

కల్లూరులో...

కల్లూరు, ఫిబ్రవరి17 (ఆంధ్రజ్యోతి): మిర్చికి మద్దతు ధర కల్పించాలని పలువురు నాయకులు కోరారు. సోమవారం మండల పరిధిలోని చెన్నూరు, తాళ్లూరు, వెంకటాపురం తదితర గ్రామాల్లోని మిర్చి కల్లాల్లో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కమిటీ సభ్యుడు తస్నీరు కృష్ణార్జునరావు, రైతు సంఘం నాయకులు మాదల వెంకటేశ్వరరావు, ముదిగొండ అంజయ్యలు సందర్శించారు. ఈ కార్యక్రమంలో అర్జునరావు, ముత్తారావు, ఆర్ కిషోర్ తదితరులున్నారు.

బోనకల్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



మాట్లాడుతున్న డీఈ శ్రీనివాస్

బోనకల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బోనకల్ గ్రామ పంచాయతీ కార్యాలయం సమీపంలో సోమవారం లో వోల్టేజీ సమస్య పరిష్కారం కోసం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ఇట్టి పనులను విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాస్, ఏడీఈ కిరణ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు గానూ అవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సిబ్బంది లక్కిశెట్టి వెంకటేశ్వరరావు, జమీల్, రాజేష్, గ్రామస్థులు బండి వెంకటేశ్వర్లు, బొబ్బిళ్ల నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

హమాలీ వర్కర్స్ సభ పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వైరా, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 21న జరిగే హమాలీ అండ్ మిల్లు వర్కర్స్ నాలుగోవ రాష్ట్ర మహాసభల ప్రచార పోస్టర్లు, కరపత్రాలను సోమవారం వైరాలో ఆవిష్కరించారు. ఈ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీవై.పుల్లయ్య, వెంకటేష్, వెంకటేశ్వర్లు, గోపయ్య, భద్రయ్య, కుటుంబరావు, యలదండి బాబు పాల్గొన్నారు.

మహిళకు కృత్రిమ కాలు ఏర్పాటు



కృత్రిమకాలుతో సునీత

కారేపల్లి, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గాంధీనగరం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన సునీత ఇటీవల ప్రమాదంలో కాలు కోల్పోయింది. కాగా ఈ విషయాన్ని ఆదే ప్రాంతానికి చెందిన సోడి కోటేశ్వరరావు గతంలో కారేపల్లి మండల ఎస్ఐగా పనిచేసి, ప్రస్తుతం ఖమ్మంలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐగా పనిచేస్తున్న పుష్పాల రామారావు దృష్టికి తీసుకవెళ్లారు. ఎస్ఐ రామారావు తనకు పరిచయం ఉన్నా స్వచ్ఛంద సేవకుడు విజయవాడకు చెందిన శ్రీనివాస్‌రావు ఆర్థిక సహాయంతో, సంస్థ ప్రతినిధి జన్ను నాగరాజు ఆధ్వర్యంలో విదేశాల నుంచి రూ.లక్ష వ్యయంతో ఆధునాతనమైన ప్రొస్తేటిక్ లింబ్‌ను సోమవారం విజయవాడలో ఆమెకు అమర్చారు. దీంతో సునీత,ఆమె భర్త రవీందర్ పలువురు ఎస్ఐ రామారావు చేసిన కృషిని అభినందించారు.

మహిళ అదృశ్యం

మధిర రూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మర్లపాడు గ్రామంలో ఓ వివాహిత మహిళ అదృశ్యమైనట్లు ఆమె కుటుంబ సభ్యులు సోమవారం మధిర రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదే మండలానికి చెందిన ఆమె మర్లపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని కొన్నినెలల క్రితం వివాహం చేసుకుంది. ఈ మహిళ అదృశ్యమైనట్లు పోలీస్‌స్టేషన్‌లో ఆమె బంధువులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

నిత్యావసరాల పంపిణీ

వైరా, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వైరా శాంతినగర్‌కు చెందిన కొమ్ము శ్రీనివాసరావు ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబానికి గ్రేట్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్ ఉంద్రు శ్యాంబాబు సహకారంతో నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు.

మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు



వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న లింగాల కమల్‌రాజు

మధిరటౌన్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం మధిరలో ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆధ్వర్యంలో బంజారా కాలనీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించారు. మాజీ మునిసిపల్ చైర్మన్ మొండితోక లత ఆధ్వర్యంలో వినాయకుడి గుడి లో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు చిత్తారు నాగేశ్వరరావు, రంగిశెట్టి కోటేశ్వరరావు, బీఆర్ఎస్ రూరల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి శ్రీను, కనుమూరి వెంకటేశ్వర్లు, భాస్కర్ రెడ్డి, అరిగె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైరా, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలో సోమవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. సోమవరం గ్రామంలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. మాజీ మునిసిపల్ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, మద్దెల రవి, నాయకులు మాదినేని ప్రసాద్, పెరుమాళ్ల కృష్ణమూర్తి, కొల్లి నాగేశ్వరరావు, గుజ్జర్లపూడి దేవరాజ్, వెంకటేశ్వరరావు, బోసు పాల్గొన్నారు.

తల్లాడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం తల్లాడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దుగ్గిదేవర వెంకట్‌లాల్, సొసైటీ వైస్‌చైర్మన్ కటికి నర్సింహారావు, వజ్రాల రామిరెడ్డి, జీవీఆర్, బద్దం కోటిరెడ్డి, కేతినేని చలపతిరావు, కోడూరి వీరకృష్ణ పాల్గొన్నారు.



తల్లాడలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వేంసూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం వేంసూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు దొడ్డా వెంకటకృష్ణారెడ్డి, పుచ్చకాయల శంకర్‌రెడ్డి, కంటే వెంకటేశ్వరరావు, వెంకటకృష్ణారెడ్డి, గంఢ్ర సోమిరెడ్డి, నూనె హరిబాబు, గొర్ల సత్యనారాయణరెడ్డి, జంగా వెంకటనర్సారెడ్డి, షేక్.లాల్‌ఉడే పాల్గొన్నారు.

కొణిజర్ల,ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మపాలెం, తీగలబంజర గ్రామాలలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను సోమవారం నిర్వహించారు.

ముదిగొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ముదిగొండలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాచేపల్లి లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు గడ్డం వెంకట్, నాయకులు పోట్ల వెంకటప్రసాద్, మందరపు ఎర్ర వెంకన్న, కోడె బాబూరావు, ఏలూరి రమేష్, కాజా, అనంతరాములు, బంకా మల్లయ్య, సీతారామయ్య, రవి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పెనుబల్లి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు 71వ జన్మదిన వేడుకలను పెనుబల్లి మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వీఎంబంజర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు కనగాల వెంకట్రావ్, చెక్కిలాల లక్ష్మణ్‌రావు, లక్కినేని వినీల్, చెక్కిలాల మోహన్‌రావు, కొప్పుల గోవిందరావు, మందడపు అశోక్‌కుమార్, గోదా చెన్నారావు, బండి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు సత్తుపల్లిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మునిసిపల్ మాజీ చైర్మన్ కూసంపూడి మహేష్, మాజీ జడ్పీటీసీ సభ్యులు కూసంపూడి రామారావులు భారీ కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డా శంకరరావు, చాంద్‌పాషా, మల్లూరు అంకంరాజు, కాల్నేని వెంకటేశ్వరరావు, ఆయూబ్‌పాషా, నడ్డి ఆనందరావు, వనమా వాసు తదితరులు పాల్గొన్నారు.

చింతకాని ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మంకెన రమేష్, బొడ్డు వెంకటరామారావు, గురిజాల హనుమంతరావు, వంకాయలపాటి లచ్చయ్య, సత్యనారాయణ, సామినేని అప్పారావు, మర్రి ప్రకాశ్, కొల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా లింగమంతుని జాతర



బోనాలతో ప్రదర్శనగా వెళ్తున్న మహిళలు

ముదిగొండ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ముదిగొండలో లింగమంతుని జాతర సోమవారం వైభవంగా జరిగింది. మహిళలు బోనమెత్తుకొని పొటేళ్ల ప్రభ బండ్లు, డప్పువాయిద్యాల నడుమ గ్రామంలో ప్రదర్శనగా లింగమంతుని గుట్ట వద్దకు తరలివెళ్లారు. బోనాల ప్రదర్శనలతో చిన్నారులు, యువతీయువకులు నృత్యాలతో సందడి చేశారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పాలపొంగళ్లను తయారుచేసి నైవేద్యాన్ని సమర్పించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

గెజిటెడ్ ఆఫీసర్ల డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్

మధిరటౌన్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోషియేషన్ ముద్రించిన డైరీని సోమవారం మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జయదాస్ ఆవిష్కరించారు. తెలంగాణ సాధనలోను, తెలంగాణ పునర్ నిర్మాణం లోను టీజీవో నిర్వహించిన పాత్ర మరువలేనిదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీజీవో జిల్లా నాయకులు గద్దల విక్రమ్, చిన్న సాంబయ్య, అధ్యాపకులు షాహిన్ బేగం, కమల కుమారి, ఉపేంద్ర, కృష్ణ, నాగరాజు, ప్రగతి తదితరులున్నారు.

జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల పరిశీలన

చింతకాని, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నేరడ గ్రామంలో ఉప ఆరోగ్య కేంద్రంలో సోమవారం జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల పరిశీలన కార్యక్రమాన్ని ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ నిబంధనల ప్రకారం ఆరోగ్య కేంద్రం ద్వారా రోగులకు అందుతున్న సేవలు, మందుల పంపిణీ, పరిసరాల పరిశుభ్రత వివరాలను ఆన్‌లైన్ ద్వారా కేంద్రం బృందం పరిశీలించింది. కార్యక్రమంలో జిల్లా బృందం దుర్గా బిందు, రామారావు, వైద్యాధికారులు అల్తాఫ్, సోహెల్, భార్గవ్‌కుమార్, పుష్పలత, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కొణిజర్ల, ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి): గత 20 సంవత్సరాలుగా కొణిజర్ల సూపర్‌జెమ్స్ పాఠశాలలో ఆయాగా పని చేస్తున్న రమణ ఇటీవల అనారోగ్యానికి గురైంది. ఆమె వైద్య పరీక్షల నిమిత్తం తమ వంతుగా పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు రూ.10వేలను విరాళాలను సేకరించారు. కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు, పాఠశాల ప్రిన్సిపాల్ కొనతం ఉమాశంకర్ చేతులు మీదుగా సోమవారం ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మధిరటౌన్‌లో....

మధిరటౌన్, ఫిబ్రవరి17(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి కనపర్తి మనోజ్ కుమార్‌కు ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం టీవీఎం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తేళ్ల సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డిలు రూ. ఐదు వేల నగదును అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్ ఉన్నారు.



సాయం అందిస్తున్న ఉమాశంకర్, సూరంపల్లి

'అంకితభావంతో పని చేసి విద్యాభివృద్ధికి పాటుపడాలి'

బోనకల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పని చేసి విద్యాభివృద్ధికి పాటుపడాలని ఎంఈవో దామాల పుల్లయ్య సూచించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సోమవారం 2008 డీఎస్సీ ద్వారా నూతనంగా వచ్చిన ముగ్గురు ఉపాధ్యాయులకు ఆయన నియామక ఉత్తర్వులను అందించారు. మంచిగా పని చేసి పేరు తెచ్చుకోవాలని కోరారు. నూతనంగా విధుల్లోకి చేరిన టీచర్లకు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోతు రామకృష్ణ, జిల్లా నాయకుడు సదాబాబు, రావినూతల పీఎస్ హెచ్ఎం సీహెచ్. వెంకటేశ్వరరావు, విద్యాశాఖ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సత్తుపల్లిరూరల్‌లో...

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఆదేశాల మేరకు 2008లో డీఎస్సీలో ఉద్యోగం సాధించిన ఓ అభ్యర్థి 17సంవత్సరాల తర్వాత సోమవారం ఉపాధ్యాయురాలిగా బాధ్యతలలో చేరారు. ముదిగొండ మండలం కమలాపురం గ్రామానికి చెందిన గండ్ర లావణ్య సత్తుపల్లి మండల వనరుల కేంద్రంలో ఎంఈవో నక్కా రాజేశ్వరరావుకు నియామకపత్రాలు అందించగా మండలంలోని గంగారం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు చేపట్టారు. ఉద్యోగం రావడంతో లావణ్య సంతోషం వ్యక్తం చేశారు.